# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 6-3-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:165 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం- నేటికి అందం**

పాలన నాన్ లైన్ లో జర
పాలని నిర్ణయము జేసి ప్రజలను గొలువన్
పాలకులను శ్లాఘించెద
కాలమ్మున కనుగుణమ్ముగా నడుగు లిడన్ !!

(కాలానికి తగినట్లుగా తెలంగాణా లో పాలన నంతా ఆన్ లైన్ లోనే జరపాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించడాన్ని అందరూ స్వాగతిస్తున్నారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

అధికారంతో వచ్చే
అహం బాగ పెరిగిందా
పరిపాలనపై మంచి
ప్రజలనుండి గోవిందా
అధినేతలు మంత్రులు
అందరికిది హెచ్చరిక
మమేకం క్షేత్రస్థాయి
మర్చితెవరు మెచ్చరిక



-వేల్పుల నారాయణ
9440433475

# రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసిన బీహార్ సీఎం నితీశ్ కుమార్



పాట్నా, మార్చి5: బీహార్ సీఎం నితీశ్ కుమార్ . ఇవాళ రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేశారు. అసెంబ్లీ కార్యదర్శి ఖ్యాతి సింగ్ కార్యాలయంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సమక్షంలో జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్ నామినేషన్ పేర్లను అందజేశారు. రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసినట్లు నితీశ్ తన ఎక్స్‌లో వెల్లడించారు. బీహార్‌కు అత్యధిక కాలం సీఎంగా బాధ్యతలు నిర్వర్తించిన వ్యక్తిగా నితీశ్ రికార్డు క్రియేట్ చేశారు. అయితే రాజ్యసభలో సభ్యుడు కావాలన్న కాంక్ష ఉన్నట్లు ఆయన తెలిపారు. నితిశ్ తన అభిప్రాయాన్ని ఎక్స్‌లో వ్యక్తం చేశారు. బీహార్ రాజకీయాల్లో పెను మార్పులు జరగనున్నట్లు ఆయన చెప్పారు.

నితీశ్ తప్పుకోవడంతో.. బీహార్‌కు బీజేపీ అభ్యర్థి సీఎం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇక నితీశ్ కుమారుడు నిషాంత్.. డిప్యూటీ సీఎం బాధ్యతలు చేపట్టే ఛాన్సు ఉన్నది. రెండు దశాబ్ధాల పాటు తనపై నమ్మకాన్ని, విశ్వాసాన్ని ఉంచారని, దీని ఆధారంగానే బీహార్‌కు సేవ చేశానని, మీ నమ్మకం, మద్దతుతోనే బీహార్‌ను కొత్త అభివృద్ధి కోణం వైపు తీసుకెళ్లినట్లు చెప్పారు. తనపై నమ్మకాన్ని ఉంచి సపోర్టు ఇచ్చినందుకు గతంలో అనేక సార్లు కృతజ్ఞలు చెప్పినట్లు నితీశ్ పేర్కొన్నారు.

తన రాజకీయ ప్రస్థానం మొదలైన నాటి నుంచి.. బీహార్ అసెంబ్లీ, మండలితో పాటు.. పార్లమెంట్ ఉభయసభల్లోనూ సభ్యుడిని కావాలన్న కాంక్ష ఉండేదని చెప్పారు. ఆ కోరికతోనే రాజ్యసభ సభ్యుడిని అయ్యే సందర్భం వచ్చిందన్నారు. భవిష్యత్తులో మీతో ఇదే రకమైన రిలేషన్ కొనసాగుతుందన్నారు. కొత్తగా ఏర్పడబోయే ప్రభుత్వానికి పూర్తి మద్దతు ఉంటుందన్నారు. బీహార్ సీఎం పోస్టు రేసులో నిత్యానంద్ రాయ్‌తో సమ్రాట్ చౌదరీ ముందు వరుసలో ఉన్నట్లు తెలుస్తోంది.

## సీజ్ చేసిన హిటాచి మాయం.. యజమానిపై కేసు నమోదు

మాగనూరు, మార్చి5: మాగనూరు మండలంలో అక్రమ ఇసుక రవాణాకు ఉపయోగిస్తు పట్టుబడి మాయమైన హిటాచి ఘటన కలకలం రేపుతుంది. అమ్మపల్లి సమీపంలో గత బుధవారం 10 ఇసుక దంపులు, ఒక ట్రాక్టర్, ఒక హిటాచిని జిల్లా మైనింగ్ ఆర్. ఐ ప్రతాప్ రెడ్డి గుర్తించి సీజ్ చేసి, ట్రాక్టర్ను మాత్రమే పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. హిటాచి పెద్ద వాహనం కావడంతో వాగు సమీప దూరంలోనే వదిలేసి వచ్చారు.

హిటాచిని సీజ్ చేసిన గంట వ్యవధిలోని ఆ వాహనం అక్కడి నుంచి మాయం అయ్యింది. అదే రోజు రాత్రి ఇసుక రీచ్ ల వెంబడి ఎస్ఆర్ఏలను, జీపీవోల ను బందోబస్తు ఏర్పాటు చేసినా గాని హిటాచి మాయం కావడంతో రెవెన్యూ సిబ్బందిలో వణుకు మొదలైంది. దీంతో విషయం తెలుసుకున్న తాసిల్దార్ సురేష్ హిటాచి ఓనర్ పై మాగనూరు ఎస్సై అశోక్ బాబుకు ఫిర్యాదు చేశారు.

# హైదరాబాద్ టోలీచౌకీలో భవనం పైనుంచి పడి ఇద్దరి మృతి



హైదరాబాద్, మార్చి5: నగరంలోని టోలీచౌకీలో ఘోర ప్రమాదం జరిగింది. అల్ హస్నాత్ కాలనీలో భవన నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన గోవా కర్రలు కూలిపోవడంతో పైనుంచి కిందపడి ఇద్దరు కార్మికులు మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతి చెందిన వారు శ్రీకాకుళం జిల్లాకు చెందిన తిరుపతి రావు, అది నారాయణగా గుర్తించారు. గాయపడిన వారు శ్రీకాకుళానికి చెందిన ఆర్.రమేష్, ఒడిశాకు చెందిన ఏం.రమేష్, బండ్లగుడాకు చెందిన లాల్ అహ్మద్‌గా గుర్తించారు. గాయపడ్డ వారిని లంగర్ హౌస్‌లోని అలివ్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించిన పోలీసులు.

భవనం పక్కనే ఆటోలో ఉన్న వారిపై గోవా కర్రలు పడటంతో అందులో ఉన్నవారు కూడా గాయపడ్డట్లు సమాచారం. భవన నిర్మాణం కోసం కట్టిన గోవా కర్రలపై నిలబడి పనులు చేస్తుండగా ఒక్కసారిగా కర్రలు కూలడంతో ఈ ప్రమాదం జరిగింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణం పనులు జరుగుతున్నాయని గుర్తించిన జీహెచ్ఎంసీ అధికారులు యజమానికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు.

## మావోయిస్టు అగ్రనేత గణపతి స్వగ్రామంలో టెన్షన్..

జగిత్యాల మార్చి 5:మావోయిస్టు అగ్రనేత గణపతి స్వగ్రామం బీర్‌పూర్ బుధవారం రాత్రి టెన్షన్ వాతావరణం నెలకొంది. మావోయిస్టు అగ్రనేత ఢిల్లీలో లొంగిపోతున్నాడని వార్తలు రావడంతో గ్రామంలో ఒకేసారిగా టెన్షన్ వాతావరణం నెలకొంది. గ్రామంలోని వృద్ధులు, యువకులు, మహిళలు ఆసక్తితో టీవీల వద్ద కూర్చొని ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకుంటున్నారు. ఉపాధ్యాయుడిగా ఉండి ఉద్యమాల్లోకి వెళ్లిన గణపతి ఇప్పుడు ఎలా ఉన్నాడో చూడాలనే ఆత్రుతతో బీర్‌పూర్ ప్రజలు ఎదురుచూస్తున్నారు. ముపాల లక్ష్మన్‌రావ్ అలియాస్ గణపతి లొంగిపోవాలని 2013లో బీర్‌పూర్ గ్రామంలో అప్పటి ఎస్పీ శివకుమార్ ఆద్వర్యంలో అంతర్మథనం కార్యక్రమాన్ని నిర్వహి ంచారు. ఈసం దర్భంగా గ్రామంలో ఎస్పీ శివకు మార్ బస చేశారు. వేదికపై గణపతి లొంగిపోవా లని జనప్రవంతిలో కలవాలని ఎస్పీ ఆహ్వానించారు.

## టోలీచౌకీ ప్రమాద స్థలాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

హైదరాబాద్, మార్చి5: హైదరాబాద్ టోలీచౌకిలోని అల్ హస్నాత్ కాలనీలో భవన నిర్మాణ పనులు చేస్తుండగా పరందా కూలిన విషయం తెలిసిందే. నిర్మాణ పనులు చేస్తున్న కార్మికుల్లో ప్రమాదవశాత్తు ఐదుగురు కార్మికులు కింద పడ్డారు.

ఈ ఘటనలో ముగ్గురు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందగా.. పలువురికి తీవ్రగాయాలయ్యాయి. బాధితులను ఆస్పత్రికి తరలించి చికిత్సనందిస్తున్నారు.

కాగా ఘటనాస్థలాన్ని బీఆంఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరును, రెస్క్యూ టీం సహాయక చర్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అందిస్తున్న చికిత్స గురించి ఆరా తీశారు. కొత్త భవనానికి గోవా కర్రలు కట్టి.. కార్మికులు వాటిపై నిలబడి పనులు చేస్తుండగా సడెన్‌గా ఆ కట్టెలు కూలిపోవడంతో ఈ ప్రమాదం జరిగింది.

# గల్ఫ్‌లో తీవ్ర ఉద్రిక్తతలు.. చిక్కుల్లో 23 వేల మంది భారతీయులు



న్యూఢిల్లీ, మార్చి 5:ఇరాన్ యుద్ధం నేపథ్యంలో గల్ఫ్ ప్రాంతంలో 23 వేల మంది భారతీయులు చిక్కుకుపోయినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇరాన్ అణు కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తూ ఇజ్రాయెల్, అమెరికా దేశాలు దాడులకు దిగడంతో మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతలు చెలరేగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసి వేసింది. ఆ జలాల్లో ప్రయాణించే నౌకలపై దాడులు తప్పవని హెచ్చరించింది. దీంతో, ముడి చమురు రవాణాకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి.

ఇప్పటికే ఆ ప్రాంతంలో ఉన్న పలు ఆయిల్ ట్యాంకర్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఆయిల్ ట్యాంకర్‌లపై జరిగిన దాడుల్లో కొందరు మరణించారు. వీరిలో ఇద్దరు భారతీయులు ఉన్నట్టు కూడా వెలుగులోకి వచ్చింది. ఇక భారత్ జెండాలతో ప్రయాణిస్తున్న 36 నౌకలు కూడా అక్కడి జలాల్లో నిలిచిపోయాయి. వీటిల్లో అధిక శాతం ముడి చమురు రవాణా నౌకలేనని తెలుస్తోంది. వీటితో పాటు కొన్ని కమర్షియల్ కార్గో, ఎల్‌పీజీ గ్యాస్‌ను తరలించే నౌకలు కూడా ఉన్నాయి.

## దేశవ్యాప్తంగా 50 బాంబు బెదిరింపు మెయిల్స్.. 28 ఏళ్ల యువకుడు అరెస్ట్



న్యూఢిల్లీ, మార్చి 5:వరుసగా నకిలీ బాంబు బెదిరింపులకు పాల్పడుతున్న యువకుడిని గుజరాత్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు 50కిగా బాంబు బెదిరింపు మెయిల్స్ పంపినట్లు పోలీసులు తెలిపారు. గత ఐదు రోజుల్లోనే వచ్చిన బాంబు బెదిరింపు మెయిల్స్‌పై విచారణ జరపగా నిందితుడి వ్యవహారం తేలింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఐదు రోజుల్లో ముంబై, ఢిల్లీ నగరాలతోపాటు గుజరాత్, ఇతర రాష్ట్రాలకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి.

స్కూల్స్, మెట్రో స్టేషన్లు, ముంబై స్టాక్ ఎక్స్‌ఛేంజ్ సహా వివిధ సంస్థలకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. దీనిపై ముంబై, గుజరాత్ సహా పలు చోట్ల ఫిర్యాదులు అందాయి. అందులో గుజరాత్ పోలీసులు ఈ అంశాన్ని మరింత సీరియస్‌గా తీసుకుని, తక్షణ విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన సౌరవ్ విశ్వాస్ అనే 28 ఏళ్ల యువకుడు ఈ మెయిల్స్ పంపుతున్నట్లు గుర్తించారు. వెంటనే గుజరాత్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు, అహ్మదాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సంయుక్తంగా నిందితుడి కోసం గాలించారు. పశ్చిమ బెంగాల్ చేరుకుని స్థానిక పోలీసుల సాయంతో సౌరవ్ విశ్వాస్‌ను అరెస్టు చేశారు. నిందితుడు ఫిబ్రవరి 27న ముంబైలోని పలు పాఠశాలలకు బాంబు బెదిరింపు మెయిల్స్ పంపాడు. రెండు రోజుల్లో బాంబులు పేల్చేస్తానని బెదిరించాడు.

ఇలా పలు స్కూల్స్, మెట్రో స్టేషన్స్, ఇతర సంస్థలకు బెదిరింపు మెయిల్స్ చేశాడు. అతడి బెదిరింపు మెయిల్స్‌తో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. మొత్తంగా 50కిపైగా మెయిల్స్ పంపినట్లు గుర్తించారు. అతడిని గుజరాత్ పోలీసులు అరెస్టు చేయగా.. అనంతరం ముంబై పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. వివిధ చోట్ల అతడిపై కేసులు నమోదయ్యాయి.

# బ్రిటన్ బేస్‌ల నుంచి బీ2 బాంబర్లను ఆపరేట్ చేయనున్న అమెరికా



న్యూయార్క్, మార్చి5: ఇరాన్‌పై మరింత దూకుడుగా అమెరికా దాడి చేయనున్నది. దీని కోసం మళ్లీ స్టీల్త్ బాంబర్లను సిద్ధం చేస్తోంది. బ్రిటన్‌కు చెందిన రెండు ఎయిర్ బేస్‌లను వాడుకునేందుకు ప్లాన్ చేసింది. బీ2 బాంబర్లను ఆ ఎయిర్‌బేస్‌ల వద్ద మోహరించే ప్రక్రియను చేపట్టింది. బ్రిటీష్ మిలిటరీకి చెందిన హిందూ మహాసముద్రంలోని డీగో గార్సియా, గ్లోసెస్టర్‌షైర్‌లోని ఆర్ఏఎఫ్ ఫెయిర్‌ఫోర్డ్ ఎయిర్ బేస్‌ల నుంచి బీ2 బాంబర్లను వినియోగించాలని అమెరికా భావిస్తున్నది. ఈ నేపథ్యంలో ఆ స్థావరాలకు బీ2 బాంబర్లను మోహరిస్తున్నది.

బీ2 బాంబర్ ఖరీదు సుమారు రెండు బిలియన్ల డాలర్లు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న అత్యంత ఖరీదైన యుద్ధ విమానం ఇదే. మరికొన్ని రోజుల్లో బ్రిటన్ ఎయిర్‌బేస్‌లకు బీ2 బాంబర్లు చేరుకోనున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 28వ తేదీన చేపట్టిన ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీలో భాగంగా బీ2 బాంబర్లు అమెరికా నుంచి నాన్‌స్టాప్ జర్నీ చేసి టెహ్రాన్‌పై అటాక్ చేశాయి. అయితే సుమారు రెండువేల పౌండ్ల బాంబులతో ఆ రోజున ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి కేంద్రాలపై బీ2 బాంబర్లు దాడి చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ కన్ఫర్మ్ చేసిన విషయం తెలిసిందే.

బ్రిటన్ మిలిటరీ ఎయిర్‌బేస్‌లను అమెరికా వాడుకునేందుకు ఆ దేశ ప్రధాని కీర్ స్టార్మర్ ఆదివారం అనుమతి ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆ కేంద్రాలకు బీ2 బాంబర్లు చేరుకోనున్నాయి.

# కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెకు పిలుపు : ఏఐటీయూసీ కేంద్ర కమిటీ




ఖమ్మం, మార్చి 5:సింగరేణిలో కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెకు పిలుపునిస్తామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ లు అన్నారు. గురువారం గోదావరి ఖనిలో జరిగిన ఏఐటియుసి కేంద్ర కమిటి సమావేశంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ..సింగరేణి యాజమాన్యం గుర్తింపు సంఘం ఏఐటియుసితో నవంబర్ 2024 , మార్చి 2025లో జరిగిన స్ట్రక్చర్ కమిటీ సమావేశాల్లో పలు డిమాండ్ లను అంగీకరించి అమలు చేయడం లేదని ఆరోపించారు. ముఖ్యంగా స్వంత ఇంటి పథకాన్ని, పెర్క్స్ పై ఇన్ కం టాక్స్ చెల్లింపులపై సర్క్యులర్లను జారీ చేయకుండా కార్మికులను మోసం చేస్తుందని ఆరోపించారు.

ఏసీబీ కేసుతో సంబంధం లేకుండా మెడికల్ బోర్డును వెంటనే నిర్వహించాలి. మెడికల్ బోర్డు ను ఏసీబీ విచారణ పేరుతో నిలిపి వేశారని వారు ఆరోపించారు. అనారోగ్యం వల్ల కార్మికులు చాలా మంది మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకొని సంవత్సరాలు గడిచినా ఇప్పటి వరకు మెడికల్ బోర్డు కు పిలువ కుండా కాలయాపన చేస్తూ కార్మికులను యాజమాన్యం ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు ఆరోపించారు. మారుపేర్ల విజిలెన్స్ కేసుల కార్మికుల డిపెండెంట్లకు ఉద్యోగాలు ఇవ్వకుండా యాజమాన్యం సమస్య రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉందని పరిష్కారం చూపకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల వారికి ఉద్యోగాలు రావడం లేదని వారు ఆరోపించారు. జనరల్ సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్టు కార్మికుల నుంచి జీతం రికవరీ చేస్తామని యాజమాన్యం ఆదేశాలు జారీ చేసిందని, దానిని వెంటనే రద్దు చేసి రికవరీ చేయొద్దని డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వం సింగరేణి కి కొత్త గనులు ఇవ్వకుండా తెలంగాణ లో ఉన్న సింగరేణి సంస్థ ను నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. వేలంతో సంబంధం లేకుండా తెలంగాణ లో ఉన్న కొత్త గనులు సింగరేణి కి కేటాయించాలని డిమాండ్ చేశారు. సింగరేణి లో మైనింగ్, క్లరికల్, ట్రేడ్స్ మెన్ ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే సింగరేణి వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, లేకుంటే సమ్మె కు పిలుపు నిస్తామని వారు పేర్కొన్నారు.

ఈ సమావేశంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, ఉప ప్రధాన కార్యదర్శులు కే.సారయ్య, వై.వి.రావు, ముస్కె సమ్మయ్య, మడ్డి ఎల్లా గౌడ్, కే.వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు అక్బర్ అలీ, కవ్వంపల్లి స్వామి, కందుకూరి రాజారత్నం, బ్రాంచ్ కార్యదర్శులు బాజీ సైదా, మల్లికార్జున్, రాంగోపాల్, రమేశ్, తిరుపతి, మల్లేష్, జీగురు రవిందర్, ఎం.ఆర్.సి రెడ్డి, రంగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

అమరావతి, మార్చి 5: భక్తుల హరే కృష్ణ..హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే.., ఓం నమో భగవతే వాసుదేవాయ నామస్మ రణ నడుమ ఐదు రోజుల పాటు జరిగిన శ్రీ వేణుగోపాల స్వామి 69వ బ్రహ్మోత్సవాలు గురు వారం అంగరంగ వైభవంగా ముగిశాయి. అర్చకులు గోపాలా చార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి ఉదయం అభిషేకాలు నిర్వహించి పుష్పయాగం నిర్వహించారు.

వివిధ వాహనాలపై ఊరేగి అలసి సొలసిన రుక్మిణీ,సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి ప్రత్యేక పూల అలంకరణలో అద్దాల మండపంలో సేద తీరారు.

సాయంత్రం ద్వాదశ ప్రదక్షణములు,పవళింపు సేవ కార్యక్రమంతో ఉత్సవాలు ముగిశాయి.ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య,చైర్మన్ కావూరి శశిరేఖ,ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# దంత సంరక్షణను నిర్లక్ష్యం చేస్తున్నామా !

## (06 మార్చి "జాతీయ దంత వైద్యుల దినోత్సవం" సందర్భంగా)

హృదయంలో ఊటగా ఎగిసిపడిన ఆనంద తరంగాలు చిరునవ్వు రూపంలో బయట పడతాయి. మనకు నచ్చిన వారితో మనసారా నవ్వడం ఓ అద్భుత అవకాశం. పకపక నవ్వితే నోటి దుర్వాసన వస్తుందేమో అంటూ వెనక్కి తగ్గడం సహజంగానే జరుగుతుంది. నోటి దుర్వాసన, పంటి అపరిశుభ్రతల మూలంగా పౌరసమాజంలో ముందుకుపోలేక, వెనక్కి తగ్గలేక సందిగ్ధంలో మునిగిపోతుంటాం. నోటి పరిశుభ్రత, దంతాల ఆరోగ్య పరిరక్షణలకు మనం తగు జాగ్రత్తలు తీసుకోవడం, దంత లేదా నోటి అనారోగ్యం కలిగితేనే డెంటిస్టును లేదా దంత వైద్యున్ని సంప్రదిస్తాం. వైద్య వృత్తిలో తగు ప్రాధాన్యం లేని దంత వైద్యుల సేవలను సమాజం తగు రీతిలో గుర్తించలేదు. అలాంటి దంత వైద్యులు అజ్ఞాత హీరోల వలె సమాజంలో "అన్‌సంగ్ హీరోల" వలె విలువైన సేవలను అందిస్తున్నారు.

**జాతీయ దంత వైద్యుల దినోత్సవం:**

నోరు, దంతాలు, చిగుర్ల ఆరోగ్య పరిరక్షణలో అవిశ్రాంత సేవలను అందిస్తున్న డెంటిస్టుల అమూల్య సేవలను గుర్తించిన పౌర సమాజం ప్రతి ఏట 06 మార్చిన "జాతీయ దంత వైద్యుల దినోత్సవం" లేదా "నేషనల్ డెంటిస్ట్ డే"ను పాటించడం 2013 నుంచి ఆనవాయితీగా మారింది. దంతాలు, చిగుర్లు, నోటి పరిశుభ్రత కొరవడితే పలు రకాలైన అనారోగ్యాలు కలగడం, పంటి నొప్పులు బాధ పెట్టడం జరిగినపుడు దంత ఆరోగ్య పరిరక్షణ, నోటి పరిశుభ్రత, చిగుర్ల ఆరోగ్యం లాంటి అంశాలను సామాన్య ప్రజలకు అవగాహన కల్పించడం, తొలి దశలోనే రోగనిర్ధారణ చేయడం, తగు చికిత్సలు అందించడం, ముందు జాగ్రత్తలు లాంటి అతి విలువైన సేవలను డెంటిస్టులు కల్పిస్తున్నారు. నోటి, దంత ఆరోగ్య పరిరక్షణ పట్ల అవగాహన, వ్యాధుల నివారణ, దంత అనారోగ్యాల చికిత్సలు, కాస్మటిక్ డెంటిస్టరీ, సంపూర్ణ ఆరోగ్య సిద్ధి లాంటి లక్ష్యాలను ఛేదించడంలో దంత వైద్యులు అంకితభావంతో అమూల్య సేవలను అందిస్తున్నారు.

**దంత పరిశుభ్రతకు పాటించాల్సిన జాగ్రత్తలు:**

నిత్యం రెండు సార్లు ఉదయం నిద్ర లేచిన తర్వాత, రాత్రి నిద్రకు ముందు తప్పనిసరిగా దంతాలను సాఫ్ట్ బ్రష్‌తో శుభ్రం చేసుకోవడం, ఆహార ఆహారానికి మధ్య ఏ రకమైన ఆహారం తీసుకోకపోవడం, దంతాల్లో ఆహారం చిక్కుకోకుండా జాగ్రత్త పడడం లేదా చిక్కుకున్న వాటిని శుభ్రం చేసుకోవడం, నాలుకను శుభ్రం చేయడం, తిన్న తర్వాత నోటిని జాగ్రత్తగా శుభ్రం చేసుకోవడం లేదా నీటితో గట్టిగా పుక్కిలించి ఉంచేయడం, ప్రతి 3 లేదా 4 మాసాలకు ఒకసారి టూత్ బ్రష్‌ను మార్చి వేయడం, ఓరల్ సెక్స్‌లో తగు రక్షణ తీసుకోవడం, ఆడుతున్న సమయాల్లో మౌత్ గార్డ్‌లను వాడడం, గర్భవతులు తప్పనిసరిగా ప్రసవానికి ముందు దంత వైద్యుల సలహాలు తీసుకోవడం, ఏడాదికి కనీసం ఒక్కసారైనా దంత వైద్యులను సంప్రదించడం, పోషకాహారం తీసుకోవడం, అతి శీతల పదార్థాలకు దూరంగా ఉండడం, పొగాకు లాంటి దురలవాట్లకు దూరంగా ఉండడం లాంటి జాగ్రత్తలు దంత ఆరోగ్యాలకు పునాదులుగా పని చేస్తాయి. అంకితభావంతో అమూల్య సేవలను అందిస్తున్న డెంటిస్టులకు కృతజ్ఞతలు తెలపడం, తగు రీతిలో సన్మానాలు చేయడం, ఉచిత దంత వైద్య శిబిరాలను నిర్వహించడం, కృతజ్ఞతాపూర్వకంగా కానుకలు అందజేయడం, డెంటిస్టు వద్దకు వెళ్లడానికి ప్రణాళికలు వేసుకోవడం, విద్యాలయాల్లో అవగాహనలు కల్పించడం లాంటి కార్యక్రమాలను జాతీయ దంత వైద్యుల దినం వేదికగా చేయవచ్చు.

ప్రతి ఏట 09 ఫిబ్రవరిన అంతర్జాతీయ దంత వైద్యుల దినం కూడా పాటించడం జరుగుతోంది. నేటి డిజిటల్ యుగంలో దంత వైద్యం నవ్య టెక్నాలజీలను ఆకళింపు చేసుకొని చికిత్సా పద్ధతుల్లో విప్లవాత్మక మార్పులను స్వతం చేసుకుంటున్నది. మన ఆరోగ్యకర చిరునవ్వుకు కారణమైన తెర వెనుక హీరోలుగా దంత వైద్యులు చేస్తున్న సేవలకు తగు రీతిలో కృతజ్ఞతలు తెలియజేయడం మన కనీస ధర్మం. పౌర సమాజ నోటి శుభ్రతే లక్ష్యంగా డెంటిస్టులు చేస్తున్న సేవలను గుర్తించి మన కృతజ్ఞతలను, మన అభిమానాలను వారి పై కుమ్మరిద్దాం, ఆరోగ్యకర చిరునవ్వులతో మన జీవితాలను అనుక్షణం ఆస్వాదిద్దాం.



-ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# టోక్యోలో భారత్-జపాన్ సీఈపీఏ ఏడో సంయుక్త సంఘ సమావేశం..

## చర్చలకు సహాధ్యక్షత వహించిన వాణిజ్య విభాగ కార్యదర్శి శ్రీ రాజేశ్ అగ్రవాల్

న్యూఢిల్లీ, మార్చి 5:భారత్-జపాన్ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ) ఆధ్వర్యంలో ఏడో సంయుక్త సమితి సమావేశాన్ని జపాన్లోని టోక్యోలో 2026 మార్చి నెల 2న నిర్వహించారు. ఈ సమావేశానికి భారత ప్రభుత్వ వాణిజ్య విభాగం కార్యదర్శి శ్రీ రాజేశ్ అగ్రవాల్, జపాన్ ప్రభుత్వ విదేశీ వ్యవహారాల శాఖ సీనియర్ డిప్యూటీ మంత్రి సహాధ్యక్షత వహించారు.

సీఈపీఏ అమలుకు సంబంధించిన అంశాలను ఇరు పక్షాలూ సమీక్షించడంతో పాటు, ద్వైపాక్షిక ఆర్థిక సహకారాన్ని మరింత పటిష్ఠపరుచుకోవడానికి గల అవకాశాలపై కూడా చర్చించారు.

సమావేశం కొనసాగిన క్రమంలో, ఆర్థిక, వాణిజ్య, పరిశ్రమ మంత్రిత్వ శాఖ (ఎంఈటీఐ) ఉప మంత్రితోనూ శ్రీ అగ్రవాల్ భేటీ అయ్యారు. ద్వైపాక్షిక వాణిజ్యాన్నీ, పెట్టుబడి వాతావరణాన్నీ మెరుగుపరచడంతో పాటు ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ)కు సంబంధించి త్వరలో జరుగనున్న 14వ మంత్రుల స్థాయి సమావేశం సహా అనేక అంశాల్ని గురించి ఈ సందర్భంగా చర్చించారు.

ఎంఈటీఐ ఉప మంత్రితో శ్రీ అగ్రవాల్ సమావేశమైన సందర్భంగా, 2025 ఆగస్టులో వార్షిక శిఖరాగ్ర సదస్సు వేళ రెండు దేశాల నేతలూ ప్రకటించిన ఉమ్మడి దృష్టికోణాన్ని గుర్తుకు తెచ్చారు. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని, పెట్టుబడిని పెంచుకోవాల్సిన, వైవిధ్యాన్ని తీసుకురావాల్సిన అవసరం ఎంతయినా ఉందని స్పష్టం చేశారు. జపాన్‌కున్న సాంకేతిక విజ్ఞానం, మూలధనం, ఆధునిక తయారీ వంటి బలాలు, భారత్ లోని నైపుణ్యం గల కార్మికులు, విశాల మార్కెట్టు, శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ.. వీటి మధ్య బలమైన పూరకత్వం నెలకొనాలని సూచించారు. నేతల శిఖరాగ్ర సదస్సు సందర్భంగా చర్చించిన ఉభయ దేశాల ప్రజల రాకపోకలు సహా.. సీఈపీఏకు సంబంధించిన పూర్తి ప్రయోజనాల్ని సద్వినియోగపరుచుకోవడానికి ప్రాధాన్యాన్ని ఇవ్వాల్సి ఉందని ఆయన ప్రస్తావించారు.

జౌళి, ఫార్మాస్యూటికల్స్, వ్యవసాయంతో పాటు సేవల రంగాల్లో జపాన్‌కు భారత్ ప్రస్తుతం చేస్తున్న ఎగుమతుల్లో వృద్ధికి అవకాశాలు చెప్పుకోదగినంతగా ఉన్నాయని శ్రీ అగ్రవాల్ వివరించారు. దీర్ఘకాలిక సుస్థిరతను సాధించే దిశగా మరింత అధిక సమతౌల్యపూర్వక ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను నెలకొల్పుకోవడానికి ప్రాధాన్యాన్నివ్వాలని ఆయన స్పష్టం చేశారు.

వాణిజ్య కార్యదర్శి జపాన్ పరిశ్రమ రంగానికి చెందిన ప్రముఖ ప్రతినిధులతో ఏర్పాటైన ఒక రౌండ్‌టేబుల్ సమావేశంలోనూ పాలుపం చుకున్నారు. సాయంత్రం, భారతీయ పరిశ్రమ సమాఖ్య (సీఐఐ), కెయిదాన్‌రెన్‌ల సహకారంతో జపాన్లోని భారతీయ రాయబార కార్యాలయం ఆధ్వర్యంలో వాణిజ్య, పెట్టుబడి సంబంధిత రోడ్ షోను ఏర్పాటు చేశారు.

ఈ రోడ్ షోను భారత్ నుంచి వాణిజ్యానికి ప్రోత్సాహాన్ని అందించడంతో పాటు జపాన్ కంపెనీల నుంచి పెట్టుబడులు ఎక్కువగా వచ్చేందుకు మార్గాన్ని సుగమం చేసే ఉద్దేశంతో నిర్వహించారు.

వాణిజ్యం, పెట్టుబడి కోసం భారత్‌లో విధానపరంగా అనుకూల వాతావరణం నెలకొందని శ్రీ అగ్రవాల్ సమావేశంలో పాల్గొన్నవారి దృష్టికి తీసుకువచ్చారు. వ్యాపార సౌలభ్యాన్ని మెరుగుపరచడంతో పాటు, నియంత్రణ సంబంధిత ప్రక్రియల్ని సరళతరంగా రూపొందించడానికి చర్యల్ని చేపడుతున్నారని వివరించారు. సీఈపీఏ ఒక సుస్థిర ప్రణాళికను అందిస్తోందని ఆయన స్పష్టం చేశారు.

ఇది సుంకాల్లో నిశ్చితత్వానికీ, నియంత్రణల పరంగా ముందస్తు అంచనాలకూ బాట పరుస్తోందనీ, ఫలితంగా ప్రపంచ వేల్యూ చైన్లోనూ, సరఫరా వ్యవస్థలోనూ విశ్వసనీయ భాగస్వాములుగా భారత్, జపాన్‌ల మధ్య బలమైన సహకారానికి ఒక సహాయక వాతావరణం ఏర్పడగలదన్నారు.

# పర్షియన్ గల్ఫ్‌లో నౌకా వాణిజ్య తాజా పరిస్థితిని సమీక్షించిన మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, మార్చి 5:పర్షియన్ గల్ఫ్‌లో నౌకా వాణిజ్య భద్రత తాజా పరిస్థితిని కేంద్ర నౌకాశ్రయాలు, నౌకాయానం, జల రవాణా మంత్రిత్వ శాఖ నిశితంగా పరిశీలిస్తోంది. ఈ ప్రాంతంలో భారత పతాకంతో నడుస్తున్న నౌకలు, భారతీయ నావికులను రక్షించడానికి ముందు జాగ్రత్త చర్యలను బలోపేతం చేసింది.

పర్షియన్ గల్ఫ్‌లో ప్రస్తుత భద్రతా వాతావరణాన్ని అంచనా వేయడానికి, భారత నౌకా వాణిజ్య ఆస్తులు-సిబ్బందిపై దాని ప్రభావాలను చర్చించేందుకు ఈ రోజు నిర్వహించిన సమీక్షా సమావేశానికి కేంద్ర నౌకాశ్రయాలు, నౌకాయానం, జల రవాణా మంత్రి సర్బానంద సోనోవాల్ అధ్యక్షత వహించారు.

ఈ సమావేశంలో నౌకాయాన డైరెక్టర్ జనరల్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని ప్రస్తుత పరిస్థితిని, భారతీయ పతాకంతో గల నౌకలు, భారతీయ నావికుల భద్రత విషయంలో తాజా పరిస్థితిని కేంద్ర మంత్రికి వివరించారు.

సమావేశం తర్వాత కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ మాట్లాడుతూ, "మేం పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాం. మన నావికుల భద్రత, సంక్షేమం, నౌకా వాణిజ్య ఆస్తుల భద్రతను నిర్ధారించడానికి అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు, పర్యవేక్షణ, సమన్వయ విధానాలను కొనసాగిస్తున్నాం. సంబంధిత జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. ఎటువంటి పరిస్థితి ఎదురైనా సత్వరం స్పందించి దానిని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం" అని తెలిపారు.

పర్షియన్ గల్ఫ్, హోర్ముజ్ జలసంధి, ఒమన్ గల్ఫ్, దాని పరిసర సముద్ర ప్రాంతాల్లో క్షిపణి, డ్రోన్ కార్యకలాపాలు, ఎలక్ట్రానిక్ పరికరాల పనితీరును ప్రభావితం చేసే చర్యలు, ఇతర నౌకా వాణిజ్య భద్రతా సమస్యలు సహా ప్రతి ముప్పు విషయంలో సత్వర ప్రతిస్పందనతో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ ఆధ్వర్యంలో భారతీయ నావికులు, భారత పతాకంతో గల నౌకల భద్రత కోసం కొనసాగిస్తున్న మెరుగైన పర్యవేక్షణ, భద్రతా చర్యలను మంత్రిత్వ శాఖ పర్యవేక్షిస్తోంది.

డీజీఎస్ ద్వారా భారతీయ పతాకంతో గల నౌకల రియల్-టైమ్ ట్రాకింగ్‌ను మంత్రిత్వ శాఖ ప్రారంభించింది. రిపోర్టింగ్ ఫ్రీక్వెన్సీని పెంచింది. ఎమ్ఎమ్‌డీపీసీ డిజికామ్ సెంటర్ ద్వారా నిరంతర పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఓడలు, యజమానులు, నిర్వాహకులకు తప్పనిసరి రిపోర్టింగ్ ఆదేశాలను అమలు చేస్తున్నారు.

భారత నావికాదళం, విదేశాంగ మంత్రిత్వ శాఖ, ఇన్ఫర్మేషన్ ఫ్యూజన్ సెంటర్ ఇండియన్ ఓషన్ రీజియన్, మారిటైమ్ రెస్క్యూ కోఆర్డినేషన్ సెంటర్, విదేశాల్లోని భారత మిషన్లతో సన్నిహిత సమన్వయం కొనసాగిస్తున్నారు. నౌకాయాన కంపెనీలు, రిక్రూట్‌మెంట్-ప్లేస్‌మెంట్ సర్వీస్ లైసెన్సీలు సిబ్బందిని నియమించుకునే విషయంలో జాగ్రత్తగా ఉండాలని... నావికులు, వారి కుటుంబాలతో నిరంతర కమ్యూనికేషన్‌ను కొనసాగించాలని సూచించారు.

ఇన్ఫర్మేషన్ ఫ్యూజన్ సెంటర్ ఇండియన్ ఓషన్ రీజియన్ డైరెక్టరేట్, ఇతర ఏజెన్సీలు వారి భద్రత, శ్రేయస్సును నిర్ధారించడానికి పూర్తిస్థాయి సమన్వయంతో పనిచేస్తున్నాయి. బాధిత నావికులు, వారి కుటుంబాలకు అవసరమైన మద్దతును, సహాయాన్ని అందిస్తున్నాయి.

అధికారుల మధ్య సకాలంలో సమన్వయాన్ని ప్రారంభించడానికి, ఎటువంటి పరిస్థితులు ఎదురైనా తక్షణ ప్రతిస్పందనను నిర్ధారించడానికి, భారతీయ నావికులు, వారి కుటుంబాలకు తక్షణ సహాయం అందించడానికి ఒక ప్రత్యేక సత్వర ప్రతిస్పందన బృందాన్ని ఏర్పాటు చేశారు. హెల్ప్‌లైన్ నంబర్లనూ సిద్ధం చేశారు. వాటి గురించిన సమాచారాన్ని ఆర్‌పీఎస్ఎల్‌ల ద్వారా నావికుల కుటుంబాలతో పంచుకున్నారు.

అధిక అప్రమత్తతను కొనసాగించాలని, ప్రయాణ-నిర్దిష్ట ప్రమాద అంచనాలను చేపట్టాలని సంబంధిత వ్యక్తులు, సంస్థలకు సూచించారు. ఈ ప్రాంతంలో పనిచేస్తున్న నౌకలు నిరంతర సమాచార సంసిద్ధతను నిర్ధారిస్తూ, అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే నివేదించడానికి వీలుగా భద్రతపరంగా మెరుగైన అప్రమత్తతను, నిరంతర నిఘాను నిర్వహించాలని ఆదేశించారు.

కేంద్ర మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ... "నావికులు, నౌకా వాణిజ్య సంబంధిత వ్యక్తులు, సంస్థలకు భారత ప్రభుత్వం అండగా ఉంటుంది. భారతీయ నౌకలు, సిబ్బందిని రక్షించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడంతో పాటుగా దౌత్యపరమైన, మానవతాపరమైన మద్దతును అందించడానికి మంత్రిత్వ శాఖ సిద్ధంగా ఉంది. భారత నౌకా వాణిజ్య ప్రయోజనాల పరిరక్షణ కోసం దేశీయ, అంతర్జాతీయ వాటాదారులతో చురుకైన సమన్వయాన్ని కొనసాగిస్తుంది" అని తెలిపారు.

# మంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ..

అమరావతి, మార్చి 5:పామర్రు మండలం కొండి పర్రు గ్రామానికి చెందిన డొక్కు శేషయ్యకి 25 వేల రూపాయలు, చాట్ల వెంకటేశర్మకి 24 వేల రూపాయలు సీఎంఆర్ ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, పామర్రు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నూకారపు వీరాంజనేయులు వాళ్ళ ఇళ్ళకు వెళ్లి అందజేశారు.

ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఏకుల చిరంజీవి, బూత్ కన్వీనర్లు పసుపులేటి విజయ్ కుమార్ ముదునూరి సుమన్ రాజు ఐటీడీ అధ్యక్షుడు మట్ట ఆంజనేయులు మోరా ప్రసాద్ రెడ్డి మదన్ శెట్టి సత్యనారాయణ, ఎస్టీ సొసైటీ అధ్యక్షుడు పాలపర్తి సోమయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# భువనేశ్వర్ రాజధాని ప్రాంత రింగు రోడ్డు నిర్మాణ కాంట్రాక్టును ఖరారు చేసిన ఎన్ హెచ్ఏఐ

న్యూఢిల్లీ, మార్చి 5:ఒడిశాలో ఆరు లైన్ల యాక్సెస్-కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ రాజధాని ప్రాంత రింగు రోడ్డు (భువనేశ్వర్ బైపాస్) ప్రాజెక్టు నిర్మాణానికి భారత జాతీయ రహదారుల సంస్థ (ఎన్ హెచ్ఏఐ) లెటర్ ఆఫ్ అవార్డు (ఎల్ఓఏ) జారీ చేసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా రమేశ్వర్ నుంచి టాంగి వరకు 111 కిలోమీటర్ల పొడవైన రింగు రోడ్డును హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హెచ్ఏఎం) కింద మూడు ప్యాకేజీలుగా అభివృద్ధి చేయనున్నారు. ఈ పనులు ప్రారంభమైన తేదీ నుంచి సుమారు 30 నెలల్లో పూర్తి అయ్యేలా లక్ష్యంగా పెట్టుకున్నారు.

ప్రాజెక్టులోని మొదటి ప్యాకేజీని మెసర్స్ పటేల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థకు కేటాయించారు. రమేశ్వర్ నుంచి బిలిపాడ వరకు 40 కిలోమీటర్ల పొడవైన ఆరు వరుసల రహదారిని నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టులో ఇరువైపులా 12.4 కిలోమీటర్ల పొడవైన సర్వీసు రోడ్ల నిర్మాణం, రెండు ఇంటర్‌చేంజ్‌లు, ఒక రైల్వే ఓవర్ బ్రిడ్జి, 10 చిన్న వంతెనలు, 142 కల్వర్టులు. ఒక వేసైడ్ ఎమినిటీ (ప్రయాణికుల సౌకర్య కేంద్రం), ఏడు ఎలివేటెడ్ అండర్‌పాస్‌లు, ఎనిమిది వీయూ పీ, ఎల్ వీయూపీ, ఎస్ వీయూపీల అభివృద్ధి కూడా ఉన్నాయి.

ఈ ప్రాజెక్టులోని రెండో ప్యాకేజీని మెసర్స్ వీఆర్ సీ కన్స్ట్రక్షన్స్ (ఇండియా) సంస్థకు అప్పగించారు. ఒడిశాలోని బిలిపాడ నుంచి గోబింద్‌పూర్ వరకు 30 కిలోమీటర్ల పొడవైన ఆరు వరుసల రహదారి నిర్మించనున్నారు. వీటిలో ఇరువైపులా 7.2 కిలోమీటర్ల పొడవైన సర్వీస్సురోడ్ల నిర్మాణం, మూడు ఇంటర్‌చేంజ్‌లు, 11 చిన్న వంతెనలు, 90 కల్వర్టులు, ఒక మార్గమధ్య సౌకర్య కేంద్రం, మూడు ఎలివేటెడ్ అండర్‌పాస్‌లు. 3 వాహన అండర్‌పాస్‌లు, 6 లైట్ వాహనాల అండర్‌పాస్‌లు, 3 చిన్న వాహనాల వెహికల్ అండర్‌పాస్‌లు ఉన్నాయి.

ఈ ప్రాజెక్టులోని మూడవ ప్యాకేజీని మెసర్స్ హెచ్ జీ ఇన్‌ఫ్రా ఇంజనీరింగ్ లిమిటెడ్‌కు కేటాయించారు. ఇది గోబింద్‌పూర్ నుంచి బందోలా టోల్ ప్లాజా సమీపంలోని టాంగి వరకు 40 కిలోమీటర్ల పొడవైన ఆరు వరుసల రహదారి. ఇరువైపులా 10 కిలోమీటర్ల పొడవైన సర్వీస్ లేదా స్లిప్ రోడ్లు నిర్మించనున్నారు. ఇందులో ఒక ఇంటర్‌చేంజ్, 23 చిన్న వంతెనలు, 69 కల్వర్టులు, ఒక మార్గ మధ్య సౌకర్య కేంద్రం, రెండు ఎలివేటెడ్ అండర్‌పాస్‌లు, అండర్‌పాస్‌లు, 6 వీయూపీ, 16 ఎల్ వీయూపీ, 3 ఎస్ వీయూపీలను నిర్మించనున్నారు. గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా రూపొందించిన ఈ రాజధాని ప్రాంత రింగు రోడ్డు (భువనేశ్వర్ బైపాస్).. భువనేశ్వర్, కటక్, ఖోర్ధా పట్టణ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించడం ద్వారా ప్రాంతీయ అనుసంధానతను, రవాణా సౌలభ్యాన్ని గణనీయంగా మెరుగుపరుస్తుందని భావిస్తున్నారు.

# కార్ నికోబార్‌లో మత్స్యకారుల జీవితాలను మారుస్తున్న జీపీఎస్



న్యూఢిల్లీ, మార్చి 5:కార్ నికోబార్‌లోని మత్స్యకారులకు పరిచయం చేసిన గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జీపీఎస్) పరికరాలు, చేపల వేటను మరింత సమర్థవంతంగా, లక్ష్యబద్ధంగా మార్చాయి. దీనివల్ల స్థానిక ప్రజలకు చేపల సరఫరా స్థిరంగా అందుతోంది.

ఫలితంగా తాజా ప్రోటీన్, ముఖ్యమైన పోషకాల వినియోగం పెరిగింది. టీటాప్ గ్రామానికి చెందిన శ్రీ జునైద్, చుచుచా గ్రామానికి చెందిన శ్రీ అబ్దుల్ సత్తార్ వంటి వారు తాము పట్టిన చేపలను మార్కెట్లలో విక్రయించడం ప్రారంభించి, తమ ఆదాయాన్ని పెంచుకున్నారు.

నికోబారీ సమాజాల జీవితం, జీవనోపాధి పూర్తిగా సాంప్రదాయ చేపల వేటపైనే ఆధారపడి ఉంటుంది. వారి వేట పద్ధతులు అనుభవంతో మెరుగుపడినప్పటికీ.. సముద్రపు అనూహ్య వాతావరణం, సరైన నావిగేషన్ పరికరాలు లేకపోవడం వల్ల గతంలో ఇబ్బందులు ఎదురయ్యేవి. వాతావరణ మార్పుల వల్ల తరచుగా పడవలు దారి తప్పిపోవడం, ఉత్పాదకత తగ్గడం, కొన్నిసార్లు ప్రాణాపాయం కూడా సంభవించేది. ఇప్పుడు జీపీఎస్ సహాయంతో ఈ ఇబ్బందులు తగ్గాయి.

ఈ సమస్యలను అధిగమించడానికి కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక విభాగం పరిధిలోని సీడ్ డివిజన్ కార్యక్రమం కింద సెంట్రల్ ఐలాండ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ జీపీఎస్ పరికరాలను ప్రవేశపెట్టింది. స్థానిక సముద్ర వాతావరణానికి, చేపల వేట పద్ధతులకు అనుగుణంగా ఈ పరికరాలను రూపొందించారు.

మత్స్యకారులు జీపీఎస్ నావిగేషన్, ఆధునిక చేపల వేట పద్ధతులను సమర్థవంతంగా ఉపయోగించేలా వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. మత్స్యకారుల అవసరాలను, వారు ఎదుర్కొంటున్న సవాళ్లను అంచనా వేయడానికి సర్వేలు నిర్వహించి, ఈ సాంకేతికతను వారు సులభంగా స్వీకరించేలా చేశారు. గిరిజన మండలి ద్వారా ఈ సాంకేతిక వినియోగాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించారు.

జీపీఎస్ సాంకేతికత ప్రవేశ పెట్టడం ద్వారా మత్స్యకారులు చేపలు ఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించే విధానంలో విప్లవాత్మక మార్పు వచ్చింది. దీనివల్ల వారు తక్కువ సమయంలోనే సరైన ప్రాంతాలకు చేరుకోగలుగుతున్నారు. ఈ పరికరాల సహాయంతో చేపలు పట్టే సామర్థ్యం గణనీయంగా పెరిగింది. ఇది వారి కుటుంబాలకు, స్థానిక సమాజానికి మరింత పోషకవిలువలు కలిగిన ఆహారం, అధిక ఆదాయం అందుబాటులోకి రావడానికి దోహదపడింది.

మత్స్యకారులకు అండగా ఉండేందుకు కార్ నికోబార్ దీవిలో తీరప్రాంత మత్స్య సమాచార కేంద్రాన్ని స్థాపించారు. దీని ద్వారా మత్స్యకారులకు అవసరమైన సమాచారం అందుతుంది. కార్ నికోబార్‌లోని గిరిజన మత్స్యకారులకు మొత్తం 5 జీపీఎస్ పరికరాలను అందించారు. మరో 5 పరికరాలను మత్స్యకారుల సాధారణ వినియోగం కోసం కేటాయించారు.

ఈ ప్రయత్నాల ఫలితంగా రోజువారీ చేపల వేట పరిమాణంలో గణనీయమైన పెరుగుదల నమోదైంది. సరైన నావిగేషన్, చేపలు ఎక్కువగా ఉండే ప్రాంతాలను ఖచ్చితంగా గుర్తించడం వల్ల చేపల వేటలో అద్భుతమైన ఫలితాలు వచ్చాయి. మత్స్యకారులు సముద్రంలో గడిపే సమయం తగ్గినా వారి రోజువారీ దిగుబడి సగటున సుమారు 168 శాతం పెరిగింది.

చేపల లభ్యత పెరగడం వల్ల కుటుంబాలు, సమాజంలో పోషకాహార వినియోగం మెరుగుపడింది. ఆదాయం పెరగడంతో వివిధ రకాల ఆహార పదార్థాలను సులభంగా పొందగలుగుతున్నారు, తద్వారా ఆరోగ్యం, పోషకాహారం రెండూ మెరుగవుతున్నాయి.

# ఇంద్రకీలాద్రిపై ఆధ్యాత్మిక వైభవం

**-విమాన గోపురంపై ఆంజనేయ స్వామి ధ్వజాల ఆవిష్కరణ..**

**-వేద మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్త పూజలు..**

**-భక్తుల క్షేమానికి శుభ సూచికమని అర్చకుల ఆశాభావం**



అమరావతి, మార్చి 5:విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. రేపటినుండి ప్రారంభమవుతున్న మహా కుంభాభిషేక మహోత్సవాలలో భాగంగా ఆలయ విమాన గోపురంపై శ్రీ ఆంజనేయ స్వామి ధ్వజాలను భక్తిశ్రద్ధలతో ఆవిష్కరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సీనానాయక్ సమక్షంలో ఉప ప్రధాన అర్చకులు శాండిల్యతో పాటు అర్చక బృందం శాస్త్రోక్త పూజలు నిర్వహించారు.

వేద మంత్రోచ్ఛారణల నడుమ విమాన గోపురంపై హనువంత్ ధ్వజాలను ప్రతిష్టించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆంజనేయ స్వామి ధ్వజాలు ధర్మరక్షణకు, భక్తుల రక్షణకు ప్రతీకగా భావిస్తారని అర్చకులు తెలిపారు. ఈ ధ్వజాల ఆవిష్కరణతో అమ్మవారిని దర్శించుకునే భక్తులకు శుభఫలితాలు కలుగుతాయని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధికారులు, అర్చకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# పారిశ్రామిక వేత్తలు యూనిట్లు స్థాపించాలి..



అమరావతి, మార్చి 5:జిల్లాలో పరిశ్రమలకు ఎదురవుతున్న అడ్డంకులన్నీ తొలగిస్తామని పారిశ్రామికవేత్తలు సత్వరమే వారి యూనిట్లు స్థాపించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కలెక్టర్ పెనమలూరు మండలంలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల సమావేశం మందిరంలో పరిశ్రమల స్థాపన.. సంబంధిత సమస్యలు అనే అంశంపై సంబంధిత అధికారులు, పారిశ్రామికవేత్తలతో సమావేశం నిర్వహించి సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మల్లవల్లి, వీరపునేనిగూడెం పారిశ్రామిక వాడలలో పరిశ్రమలు నెలకొల్పుటకు పారిశ్రామికవేత్తలకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు పారిశ్రామికవేత్తలు తమకు కేటాయించిన స్థలాలు లోతట్టుగా ఉన్నాయని వాటిని మెరక చేయుటకు మట్టి అవసరం ఉందని చెప్పారు. మట్టి దూర ప్రాంతం నుంచి తెచ్చుకోవడం వలన ఖర్చు అధికంగా ఉందని చెప్పారు. పారిశ్రామిక వాడలో సరైన భద్రత లేదని, వాచ్మెన్ సరిగా విధుల్లో ఉండటం లేదని, వీధి దీపాలు వెలగడం లేదని, తాము తెచ్చుకున్న సామాగ్రి చోరీకి గురవుతుందని కలెక్టర్ దృష్టికి తీసుకుని వచ్చారు.

రహదారేమో ఎత్తులో ఉందని మురుగునీటి వ్యవస్థ ఎలా ఏర్పాటు చేసుకోవాలో తెలియడం లేదన్నారు. దీంతో జిల్లా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ అధికారుల బృందం ఆ ప్రాంతాలను పరిశీలించి సమీపంలో ఎక్కడ నుంచి మట్టి తోలుకునేందుకు అవకాశం ఉందో చూసి రిశ్రామికవేత్తలకు అనుమతించాలన్నారు. ప్రస్తుతం ఉన్న వాచ్మెన్ సరిగా విధుల్లో లేని కారణంగా అతనిని తొలగించి అతని స్థానంలో ఇంకొకరిని నియమించాలని, అతని విధులను పర్యవేక్షించాలని సూచించారు.

అంతేకాకుండా వీధి దీపాలు కూడా వెలిగేలా చూడాలని స్పష్టం చేశారు. సామాగ్రి దొంగలించకపోకుండా భద్రత ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలన్నారు. కొందరేమో తమకు కేటాయించిన స్థలము యూనిట్ నెలకొల్పుటకు సరిపోవటం లేదని, తాము కోరినంత స్థలము ఇవ్వలేదని, అందుకు బదులుగా వేరే స్థలం కేటాయించాలని కోరుతూ అవసరమైతే అదనంగా సొమ్ము చెల్లిస్తామని చెప్పడం జరిగింది . దీంతో కలెక్టర్ వెంటనే స్పందిస్తూ వారి అభ్యర్థనను ఒకసారి మరల పరిశీలించి ప్రస్తుతం ఉన్న స్థలాన్ని రద్దుచేసి దాని స్థానంలో వారు కోరినంత స్థలము ఇచ్చే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు.

మరి కొంతమంది పారిశ్రామికవేత్తలు వారు నెలకొల్పాలనుకున్న యూనిట్లకు సంబంధించి బ్యాంకు రుణాలు కోసం పదేపదే తిరగాల్సి వస్తుందని, రుణం మంజూరు చేయడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకుని వచ్చారు. దరఖాస్తులో ఉన్న లోటుపాట్లు ఒకేసారి చెప్పకుండా ఒక్కోసారి ఒక్కొక్క తప్పును చెబుతూ కాలయాపన చేస్తున్నారన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ సంబంధిత పారిశ్రామికవేత్తల దరఖాస్తు వివరాలను స్వయంగా రాసుకుని సంబంధిత బ్యాంక్ అధికారులతో మాట్లాడుతామని చెప్పారు.

అంతేకాకుండా ఈ నెల13 వ తేదీన బ్యాంక్ అధికారుల సమావేశం నిర్వహిస్తున్నామని , బ్యాంకు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వ్యాపారవేత్తల వివరాలను గూగుల్ స్ప్రెడ్షీట్లో సేకరించి ముందుగానే బ్యాంకులకు పంపడం జరుగుతుందన్నారు. సమావేశం రోజున రుణాల గురించి విచారిస్తామన్నారు. కొందరు పారిశ్రామికవేత్తలు డాక్యుమెంట్ల ప్రకారం తమకు కేటాయించిన స్థల విస్తీర్ణం వాస్తవంగా భూమిపైన లేదని సరిహద్దుల సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు.

జిల్లా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ సర్వేయర్ ను అక్కడికి పంపించి కొలతలు కొలిచి సరి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీఐఐసీ జడ్ఎం బాబ్జి, డిఐసి జీఎం వెంకటరావు, జిల్లా ఉద్యాన అధికారి జే జ్యోతి, ప్రత్యేక అధికారులు జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షాహిద్ బాబు, గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి వెంకటరావు, మార్కెటింగ్ ఎడి నిత్యానందం, డి సి ఓ చంద్రశేఖరు, ఆర్టీవో ఎన్ యు ఎన్ ఎస్ శ్రీనివాసరావు, డి ఎల్ డి వో లు సునీత శర్మ, రాజేష్ గనుల శాఖ ఏజీ కొండారెడ్డి పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం సకాలంలో చేపట్టండి.



ఆదిలాబాద్, మార్చి 5: ప్రభుత్వం ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్లు నిర్మించాలని లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందని లబ్ధిదారులు సకాలంలో నిర్మాణపనులు పూర్తిచేయాలని గృహనిర్మాణ శాఖ ఏఈ ప్రేమ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు డి. యజ్ఞేశ్వర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసిసూర్యప్రకాశ్ రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎం. భరత్ అన్నారు. గురువారం నారాయణపేటజిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఇందిరమ్మ ఇంటినిర్మాణానికిభూమిపూజ చేశారు. అంతకు ముందు లబ్ధిదారు శారదా భానుచందర్ కు గృహ నిర్మాణ మంజూరుపత్రంపంపిణీచేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడితే ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంతో పాటు లబ్ధిదారులకు సొంతింటికల సహకారమవుతుందని అన్నారు.

ఇండ్ల నిర్మాణం చేపడుతున్న లబ్ధిదారులకు ఉచిత ఇసుక సరఫరాతో పాటు బిల్లులు దశలవారీగా వారి బ్యాంకు ఖాతాలోజమచేస్తున్నట్లు పేర్కొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందని మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరిసహకారంతో ఊట్కూర్ మండలానికి అధికంగా ఇండ్లు మంజూరు చేయిస్తామని అన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కొక్కులింగం, పంచాయతీ సిబ్బంది పోలప్ప, నాయకులు కొక్కులక్ష్మణ్, భక్కితిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక విజయవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ ప్రవీణ్య.

సంగారెడ్డి, మార్చి 5 (నేటి నిజం ప్రతినిధి)రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 99 రోజుల పాటు చేపట్టనున్న ప్రజా పాలన?ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రవీణ్య ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లాలో చేపట్టాల్సిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై జిల్లా స్థాయి అధికారులతో కలిసి ఆమె సమీక్షించారు. మండల స్థాయి అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు దూరదర్శి సమావేశం ద్వారా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రజా పాలన?ప్రగతి ప్రణాళిక అమలుకు సంబంధించిన అంశాలపై వివరణాత్మకంగా ప్రజెంటేషన్ ఇచ్చి అధికారులకు మార్గదర్శకాలు సూచించారు.

కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్ణీత కాలవ్యవధిలో లక్ష్యాలను సాధించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు.

### పది అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు

మార్చి 6 నుంచి జూన్ 12 వరకు పది ముఖ్య అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

మార్చి 6 నుండి 15 వరకు: పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ ఫైళ్ల పరిష్కారం కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో తడి?పొడి చెత్త వేరు సేకరణ, పిచ్చి మొక్కల తొలగింపు, ప్రభుత్వ భవనాల శుభ్రత చేపడతారు.

ఏప్రిల్ 6 నుండి 11 వరకు: ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు, వైద్య పరీక్షలు, గర్భిణీలు మరియు చిన్నారుల పర్యవేక్షణ, పోషకాహారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఏప్రిల్ 13 నుండి 18 వరకు: రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ట్రాఫిక్ నియమాల అమలుపై ప్రత్యేక తనిఖీలు చేపడతారు.

ఏప్రిల్ 20 నుండి 25 వరకు: అనుసూచిత కులాలు, అనుసూచిత తెగలు, వెనుకబడిన వర్గాలు, మైనారిటీల సంక్షేమ పథకాల అమలుపై పర్యవేక్షణ చేస్తారు.

ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు: బాలల రక్షణ, మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

మే 4 నుండి 9 వరకు: రైతులకు పంటలపై సూచనలు, పంట బీమా, మట్టి పరీక్షలు, సాగునీటి సమస్యల పరిష్కారంపై చర్యలు తీసుకుంటారు.

మే 11 నుండి 16 వరకు: పాఠశాలల మౌలిక వసతులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలుపై పర్యవేక్షణ ఉంటుంది.

మే 18 నుండి 23 వరకు: యువత, క్రీడలపై పోటీలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధి అవకాశాలపై కార్యక్రమాలు నిర్వహిస్తారు.

మే 25 నుండి 30 వరకు: మహిళా సాధికారత, స్వయం ఉపాధి, స్వయం సహాయక సంఘాల బలోపేతం, బాల్య వివాహాల నిరోధంపై కార్యక్రమాలు చేపడతారు.

జూన్ 1 నుండి 12 వరకు: పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధం, మొక్కల సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఈ 99 రోజుల కార్యాచరణ గ్రామం, మండలం, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఐదు దశల్లో అమలు చేయబడుతుందని కలెక్టర్ తెలిపారు. మార్చి 6న మెదక్ జిల్లా కలెక్టరేట్లో ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయిలో గౌరవ మంత్రుల సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు పూర్తి వివరాలతో సిద్ధంగా హాజరు కావాలని సూచించారు.

ప్రతిరోజు నిర్వహించిన కార్యక్రమాల వివరాలను రోజువారీ పురోగతి నివేదికల రూపంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా పురోగతి, సమస్యలు, తీసుకున్న చర్యలు వంటి వివరాలను సమగ్రంగా నివేదికలో పొందుపరచాలని తెలిపారు. కార్యక్రమం అమలుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని కలెక్టర్ వెల్లడించారు.

ఈ సమావేశంలో ఇంచార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జానకిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి డాక్టర్ శివప్రసాద్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి జ్యోతి, జిల్లా మహిళా సంక్షేమాధికారి లలితకుమారి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసంతరావు, గృహనిర్మాణ సంస్థ ప్రాజెక్టు అధికారి చలపతిరావు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, మండల అభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలి..

జైనూర్, మార్చి5: ఈ నెలలో ప్రారంభం కానున్న పదవ తరగతి వార్షిక పరీక్షలు విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని ఆదివాసి మిత్ర వెల్ఫేర్ సొసైటీ కొమరం భీం అసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు ఆడ వెంకటేష్ కోరారు. గురువారం మండలంలోని పానాపటార్ ఆశ్రమోన్నత పాఠశాలలో చదువుకుంటున్న పదవ తరగతి విద్యార్థులకు త్వరలో 10వ తరగతి వార్షిక పరీక్షలు రాయడానికి ఆ పాఠశాలలో ఆదివాసి మిత్ర వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షులు ఆడ వెంకటేష్, జైనూర్ మయూర్ ఫోటో స్టూడియో నిర్వాకులు సిందే రాజు ఆధ్వర్యంలో దాతలు ఆసిస్ జెన్ జయంతి అనూష జైన్ సాకారంతో విద్యార్థులకు పంపిణీ చేసినట్లు వారు తెలిపారు.

ఈ సందర్భంగా ఆదివాసి మిత్ర వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షులు ఆడ వెంకటేశ్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల నిర్భయంగా రాయాలని ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా కృషి చేయాలని ఆయన కోరారు.

ఉన్నత విద్యా చదువులకు 10వ తరగతి ప్రధాన మెట్టు అని మంచి ఫలితాలు సాధించేలా విద్యార్థులు పట్టుదలతో పరీక్షలు రాయాలని ఆయన కోరారు.

ఈ కార్యక్ర మంలో ఆ పాఠశాలప్ర ధానోపాధ్యాయులు దారసింగ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మధ్యప్రాచ్యంలో పరిణామాల నేపథ్యంలో పూర్తి సన్నద్ధతతో భారత్... పటిష్టంగా ఇంధన సరఫరా

అమరావతి, మార్చి 5:మధ్యప్రాచ్యంలో ఘర్షణలు, ఇంధనం విషయంలో ప్రపంచ వ్యాప్త పరిణామాల నేపథ్యంలో.. ప్రస్తుత పరిస్థితుల్లో దేశ సంసిద్ధతను పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి శ్రీ హర్దీప్ సింగ్ పూరీ మీడియాకు వివరించారు. భారత్ ప్రపంచవ్యాప్తంగా మూడో అతిపెద్ద దిగుమతిదారుగా, శుద్ధి చేసే విషయంలో నాలుగో అతిపెద్ద దేశంగా, పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులపరంగా అయిదో స్థానంలోనూ ఉందని మంత్రి తెలిపారు. మధ్యప్రాచ్యం నుంచి తలెత్తే స్వల్పకాలిక అంతరాయాలను ఎదుర్కొనేలా.. తగిన స్థాయిలో ముడి చమురు నిల్వలు, పెట్రోల్, డీజిల్, ఏటీఎఫ్ వంటి కీలక పెట్రోలియం ఉత్పత్తుల నిల్వలు దేశంలో సిద్ధంగా ఉన్నాయన్నారు.

కొన్నేళ్లుగా భారత్ వివిధ దేశాల నుంచి ఇంధన వనరులను సేకరించడం ద్వారా ప్రజలకు ఇంధన లభ్యతనూ, అందుబాటు ధరలనూ సుస్థిరం చేసిందని వివరించారు. భారతీయ ఇంధన కంపెనీలకు ప్రస్తుతం హార్ముజ్ జలసంధి గుండా వెళ్లనవసరం లేని ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలున్నాయని మంత్రి తెలిపారు. ఆ సరుకు రవాణా నౌకలు అందుబాటులో ఉంటాయనీ, హార్ముజ్ జలసంధి గుండా ప్రయాణంలో తాత్కాలిక అంతరాయం ప్రభావాన్ని తగ్గించడానికి ఇవి తోడ్పడతాయనీ వెల్లడించారు. దేశవ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తుల సరఫరా, నిల్వల స్థితిగతులను నిరంతరం పర్యవేక్షించడానికి 24లీ7 కంట్రోల్ రూ మును మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం నిల్వల విషయంలో ప్రభుత్వం సంతృప్తి తో ఉంది. భారతీయ వినియోగదారుల ప్రయోజనాలను కాపాడేందుకే ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. నిరంతర పర్యవేక్షణ ఆధారంగా.. పరిస్థితిని మరింత చక్కదిద్దడం కోసం అవసరమైతే దశలవారీగా చర్యలు తీసుకోవచ్చనే జాగ్రత్తతో కూడిన ఆశాభావాన్ని ప్రభుత్వం వ్యక్తం చేస్తోంది.

# దుర్గా భవానీ మాత ఆశీస్సులు ఉండాలి



అమరావతి, మార్చి 5:కనకదుర్గా భవానీ మాత ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ ( చిన్ని) అన్నారు. గురునానక్ కాలనీలోని శ్రీ రామ మందిర్ సభా ఆలయ ప్రాంగణంలో శ్రీ కనకదుర్గా భవానీ మాతాజీ ప్రాణ ప్రతిష్ట మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ కేశినేని శివనాథ్ ( చిన్ని) ముందుగా కనకదుర్గా భవానీ మాతాజీ ప్రాణ ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కు రామ్ మందిర్ సభ కమిటీ ప్రతినిధులు ఘన స్వాగతం పలికి మర్యాద పూర్వకంగా సత్కరించారు. ఎంపీకి స్వాగతం పలికిన వారిలో శ్రీ రామ్ మందిర్ సభా కమిటీ సభ్యులు గోపాల్ శర్మ, సునీల్ చడ్డా, ఎస్ ఎన్ కుమార్, సుభాష్ చంద్ర గుప్తా తదితరులు ఉన్నారు.

# ఆర్పీఎఫ్ సిబ్బందికి ఘన సన్మానం..



ఆదిలాబాద్, మార్చి 5: ఆల్ ఇండియా పోలీస్ మీట్లో ప్రతిభ కనబరిచి రెండు బంగారు పతకాలు, ఒక వెండి పతకం సాధించిన ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లను కాజీపేట ఆర్పీఎఫ్ పోలీస్ స్టేషన్లో ఘనంగా సన్మానించారు. గురువారం కాజీపేట ఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆల్ ఇండియా పోలీస్ మీట్లో ఆర్చరీ విభాగంలో రెండు బంగారు పతకాలు సాధించిన బోనాల శేఖర్, అలాగే హ్యాండ్బాల్లో వెండి పతకం సాధించిన జే. అనిల్ కుమార్లను వరంగల్ ఇన్స్పెక్టర్ పి. శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో ఎస్సైలు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. క్రీడల్లో ప్రతిభ చూపి శాఖకు మంచి పేరు తీసుకువచ్చినందుకు అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాగే మరిన్ని పతకాలు సాధించి పోలీస్ శాఖకు గౌరవం తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్లు, ఏఎస్ఐలు, ఆర్పీఎఫ్ సిబ్బంది, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# భారత ఆధ్యాత్మిక దృష్టి ప్రకృతితో పాటు ప్రతి ఒక్క మనిషిలోనూ దివ్యత్వాన్ని దర్శిస్తుంది: ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, మార్చి 5:ఉపరాష్ట్రపతి శ్రీ సి.పి. రాధాకృష్ణన్ ఈ రోజు కర్నాటకలోని బెళగావి జిల్లా యడూరులో శ్రీ వీరభద్రేశ్వర ఆలయ రాజగోపురం, కలశారోహణం, మహాకుంభాభిషేక కార్యక్రమ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

శ్రీ క్షేత్ర యడూరులో సభను ఉద్దేశించి ఉపరాష్ట్రపతి ప్రసంగిస్తూ ఈ సందర్భాన్ని సాంస్కృతిక పునరుత్థానంగానే కాక నాగరికతను పునరుద్ధరించుకొనే క్షణమని కూడా వర్ణించారు.

భారత్ కేవలం ఒక దేశం కాదు.. అది చైతన్యవంతమైన నాగరికతగా భాసిల్లుతోందని ఉపరాష్ట్రపతి అన్నారు. సింధూ లోయ మొదలు కన్యాకుమారి వరకు ప్రవహిస్తున్న చైతన్యం ఒక నిరంతర ప్రవాహం భారత్ అని ఆయన అన్నారు. ఈ పవిత్ర భూమిలో వేదాల శాశ్వత జ్ఞ?నం మొదటిసారి ప్రసారమైందన్నారు. అలాగే భగవద్గీత ధైర్యంతో పాటు కర్తవ్య నిర్వహణకు ముందుకు ఉరకాలని, ధర్మ మార్గంలో నడవాలని, తిరుగులేని నమ్మకంతో అంకితమివ్వాలని మానవ జాతికి మార్గదర్శనం చేస్తుందని ఉపరాష్ట్రపతి చెప్పారు.

హిందూ చేతన ఒక్క ఆచారాలకే పరిమితం కాదని, అది ఒక జీవన మార్గమని ఉపరాష్ట్రపతి అన్నారు. ప్రకృతిలో, ప్రతి ఒక్క మనిషిలో దివ్యత్వాన్ని దర్శిస్తున్న "వసుధైవ కుటుంబకమ్" (ప్రపంచమంతా ఒకే కుటుంబం) అనే శాశ్వత సిద్ధాంతాన్ని, భారత ఆధ్యాత్మిక దృష్టికోణాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు.

వీరశైవ లింగాయత్ వారసత్వాన్ని గురించి ఉపరాష్ట్రపతి చెబుతూ కర్నాటకలోను, పొరుగునే ఉన్న మహారాష్ట్రలోను ఆధ్యాత్మిక, విద్యా, సాంస్కృతిక, సామాజిక అభ్యున్నతిలో ఈ వారసత్వం చెప్పుకోదగిన తోడ్పాటును అందించిందన్నారు.

విశ్వాసం, సేవ, సామాజిక సద్భావనల విలువలను పెంచి పోషించడంలో వీరశైవ మఠాలు, ఆలయాలు ఒక పరివర్తన పూర్వక భూమికను పోషించాయని ఆయన తెలిపారు.

శివ యోగి శ్రీ కాడసిద్ధేశ్వర్ స్వామీజీ ఆధ్యాత్మిక దృష్టికోణానికి ఉపరాష్ట్రపతి నివాళులు అర్పించారు. ఆ స్వామీజీ కాలంతో పాటు కనుమరుగైన ఒక పవిత్ర స్థలాన్ని తిరిగి కనుగొని, పునరుజ్జీవింప చేసి సనాతన ధర్మమనే శాశ్వత జ్యోతిని ప్రజ్వలింప చేశారన్నారు. సనాతన ధర్మానికి తరచుగా పరీక్షలు ఎదురవ్వొచ్చేమో గాని, దానిని ఎన్నటికీ చెరిపివేయజాలరని ఉపరాష్ట్రపతి అన్నారు.

నిత్య పూజ, మతాచారాలు, జీర్ణోద్ధరణ పనులతో పాటు ఆధ్యాత్మిక సేవ.. వీటిని సంరక్షించడంలో శ్రీ కాడసిద్ధేశ్వర మఠానికి చెందిన మఠాధిపతులంతా అలుపెరుగని ప్రయత్నాలు చేస్తుండడం ప్రశంసనీయమని ఆయన అన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ చెబుతున్న "వికాస్ భీ, విరాసత్ భీ" (అభివృద్ధితో పాటే వారసత్వం) దృష్టికోణాన్ని ఉపరాష్ట్రపతి ప్రస్తావిస్తూ, భారత్లో అభివృద్ధి, వారసత్వం కలిసి ముందుకు సాగాలన్నారు. భారత్ తన నాగరికత మూలాలను బలంగా నిలబెట్టుకొంటూనే ప్రస్తుతం సాంకేతికంగా ఉన్నతిని సాధిస్తూ, ఆర్థికంగా పటిష్ఠమవుతూ, ప్రపంచంలో ప్రభావవంతమైన దేశంగా పురోగమిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు.

రాజగోపురాన్ని ప్రారంభించుకోవడమంటే అది విశ్వాస పునరుద్ఘాటన, సంప్రదాయానికి నిరంతరాయతను సంతరించడమని ఉపరాష్ట్రపతి వర్ణించారు. పవిత్ర స్థలాల పునరుద్ధరణంటే అది ఒక్క వాస్తుకళకు సంబంధించింది మాత్రమే కాదు.. సాంస్కృతిక ఆత్మవిశ్వాసాన్ని, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పునరుద్ధరించడంతో సమానమని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్న వారిలో కర్నాటక గవర్నరు శ్రీ థావర్చంద్ గెహ్లోత్, కర్నాటక ప్రభుత్వ భారీ, మధ్యతరహా పరిశ్రమలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ ఎం.బి. పాటిల్, శ్రీ శ్రీశైల జగద్గురు డాక్టర్ చన్న సిద్దరామ పండితారాధ్య శివాచార్య స్వామీజీ, పార్లమెంటు సభ్యుడు (రాజ్యసభ) శ్రీ ఈరణ్ణ కడాడి, ధార్మిక ప్రముఖులతో పాటు ఇతర ప్రముఖులు ఉన్నారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు కూడా హాజరయ్యారు.

# 10వ తరగతి హాల్ టికెట్లు విడుదల

హైదరాబాద్, మార్చి5: తెలంగాణ విద్యాశాఖ 2026 పదో తరగతి (SSC) వార్షిక పరీక్షల హాల్ టికెట్లను అధికారిక వెబ్సైట్లో విడుదల చేసింది. విద్యార్థులు తమ వివరాలను నమోదు చేసి హాల్ టికెట్లను పొందవచ్చు.అధికారిక వెబ్సైట్: bse.telangana.gov.in

విధానం: వెబ్సైట్లోకి వెళ్లి ప్రభుత్వం కేటాయించిన లింక్పై క్లిక్ చేయాలి. జిల్లా, పాఠశాల పేరు, పుట్టిన తేదీ వివరాలను సమర్పించి హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకోవాలి. హాల్ టికెట్పై ఫోటో, సంతకం, పరీక్షా కేంద్రం వివరాలను సరిచూసుకోవాలి. తప్పులుంటే వెంటనే ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలి.

# నూతన ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి నిర్మాణం, క్రీడా వసతుల అభివృద్ధిపై కలెక్టర్ ప్రవీణ్య ప్రత్యేక దృష్టి



సంగారెడ్డి, మార్చి 5(నేటి నిజం ప్రతినిధి)జిల్లాలో ఆరోగ్య సేవలను మరింత మెరుగుపరచే లక్ష్యంతో నిర్మాణంలో ఉన్న 273 కోట్ల రూపాయల వ్యయంతో నూతన ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పి. ప్రవీణ్య గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి నిర్మాణ పనులతో పాటు వైద్య కళాశాలలో కొనసాగుతున్న క్రీడా వసతుల అభివృద్ధి పనులను ఆమె సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణ పనులు వేగంగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పాత భవనంలో ఉన్న వంద పడకల వార్డును మరియు టీ?హబ్‌ను ఇతరచోటుకు తరలించి భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు.

అనంతరం వైద్య కళాశాలలో కొనసాగుతున్న క్రీడా వసతుల అభివృద్ధి పనులను పరిశీలించారు. సంస్థల సామాజిక బాధ్యత నిధులతో నిర్మాణం జరుగుతున్న ఈ క్రీడా వసతులను మూడు నెలల్లోపు పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థుల శారీరకాభివృద్ధి, ఆరోగ్య పరిరక్షణతో పాటు క్రీడా ప్రతిభను పెంపొందించడానికి ఈ వసతులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.

ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో ఉన్న ప్రత్యేక గుర్తింపు కార్డు విభాగం వార్డును మరియు కేన్సర్ డే కేర్ కేంద్రాన్ని కూడా కలెక్టర్ ప్రత్యేకంగా పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యాధికారులు కృషి చేయాలని సూచించారు. జిల్లాలో వైద్య సేవల స్థాయిని మరింత ఉన్నతంగా తీసుకెళ్లేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసంతరావు, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి అధికారి డాక్టర్ మురళీకృష్ణ, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సరైన అవగాహనతోనే విపత్తులపై విజయం

**-ఈ నెల 28వ తేదీ వరకు ఎన్‌డీఆర్ఎఫ్ ఫామెక్స్-2026.**
**-కార్యక్రమాల సత్ఫలితాలపై సమన్వయ శాఖలు దృష్టిపెట్టండి..**
**-ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**




అమరావతి, మార్చి 5:విపత్తులపై సరైన అవగాహన, ముందస్తు సన్నద్ధతతోనే వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనగలమని.. ఈ క్రమంలో సామాజిక చైతన్యం లక్ష్యంగా జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో జిల్లాలో ఫెమిలియరైజేషన్ ఎక్సర్‌సైజ్(ఫామెక్స్)-2026 కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. గురువారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఎన్‌డీఆర్ఎఫ్ ఫామెక్స్-2026పై కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధ్యక్షతన సమన్వయ శాఖల జిల్లాస్థాయి అధికారుల సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో కొండపావులూరు ఎన్‌డీఆర్ఎఫ్ పదో బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ భూపేంద్ర కుమార్ సారథ్యంలో బృంద సభ్యులు పాల్గొన్నారు. 3,31,618 హెక్టార్ల జిల్లా భౌగోళిక విస్తీర్ణంలో వరదలు వంటి విపత్తులు సంభవించేందుకు అవకాశమున్న ప్రాంతాలు, ఆయా ప్రాంతాల్లో సన్నద్ధత చర్యలు, జిల్లా విపత్తు నిర్వహణ ప్రణాళిక (డీడీఎంపీ)తో పాటు రెవెన్యూ, అగ్నిమాపక, పంచాయతీరాజ్, పోలీస్, రవాణా, ఆర్ అండ్ బీ, ఇరిగేషన్, వ్యవసాయం తదితర సమన్వయ శాఖల భాగస్వామ్యం తదితరాలపై చర్చించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో ప్రజల్లో విపత్తులపై అవగాహన పెంపొందించేందుకు, ఎన్‌డీఆర్ఎఫ్ భాగస్వామ్యాన్ని వివరించేందుకు ఎన్‌డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫామెక్స్ కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించడంలో కీలక భాగస్వాములు కావాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం జిల్లా వ్యాప్తంగా 15 రోజుల పాటు వరద ప్రభావిత ప్రాంతాలు, పాఠశాలలు, కళాశాలలు, వివిధ పరిశ్రమలతో పాటు నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ (ఎన్‌వైకేఎస్), ఆపద మిత్ర, ఎన్ఎస్ఎస్ తదితర వాలంటీర్లతో గౌరవ ప్రజాప్రతినిధుల సహకారంతో సామాజిక అవగాహన-సన్నద్ధతా కార్యక్రమాలు ఉంటాయని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు.

ప్రజల్లో భద్రతా చైతన్యం లక్ష్యం..

20 సభ్యుల ఎన్‌డీఆర్ఎఫ్ బృందం ఆధ్వర్యంలో ఫామెక్స్ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో భద్రతా చైతన్యం పెరుగుతుందని.. తద్వారా విపత్తుల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టాలను గణనీయంగా తగ్గించగలమని ఎన్‌డీఆర్ఎఫ్ పదో బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ భూపేంద్ర కుమార్ అన్నారు. విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్షణ చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా విపత్తు నిర్వహణ సామర్థ్య నిర్మాణంతో పాటు ప్రాథమిక చికిత్స, నేలకొరిగిన నిర్మాణాల్లో సెర్చ్, రసాయన, జీవ విపత్తులకు సంబంధించిన స్పందన, అగ్ని ప్రమాదాలు, తుపాన్లు, భూకంపాలు వంటివాటిపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

సమాజంలో విపత్తులపై ముందస్తు సన్నద్ధతను పెంపొందించడం, ప్రమాద సమయంలో ప్రజలు భయాందోళనలకు గురికాకుండా సమర్థంగా వ్యవహరించేలా చైతన్యం కల్పించడం అని భూపేంద్రకుమార్ వివరించారు. సమావేశంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, ఎన్‌డీఆర్ఎఫ్ బృంద సభ్యులు కె.వెంకటేశ్వర్లు, ఎస్ఆర్‌కేజీ వెంకట్, ఐ.హరికృష్ణ, విజయవాడ ఆర్‌డీవో టి.వి.సతీష్, సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అత్యవసర వైద్య సేవలలో ముందుండాలి..

ఆదిలాబాద్, మార్చి 5:ఏజెన్సీ గిరిజన ప్రాంతాల ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించడంలో 108 ఉద్యోగులు ముందుండాలని ఆదిలాబాద్ జిల్లా 108 మేనేజర్ సూరం శేఖర్ రెడ్డి ఉద్యోగులకు కోరారు. ఆయన ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ లో అంబులెన్స్ లను ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను, వాహన నిర్వహణను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రులకు చేర్చి బాధితులకు వైద్య సేవలు అందించేలా చూడాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేయకూడదని కాల్ వచ్చిన వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లి అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి వైద్య సేవలు అందేలా కృషి చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ 108 అంబులెన్స్ ఈఎంటి కుంబోజి దత్తాత్రేయ, పైలట్ మార్కపు రవీందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రూ. 35 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ జీహెచ్ఎంసీ ఎగ్జామినర్

హైదరాబాద్, మార్చి5: జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో అకౌంట్ సెక్షన్ విభాగంలో ఎగ్జామినర్‌గా పనిచేస్తున్న సూర్య వంశీ సంతోష్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సిటీ రేంజ్ 2 ఏసీబీ అధికారులు కార్యాలయంపై మెరుపు దాడి చేసి రూ.35 వేలు లంచం తీసుకున్న ఎగ్జామినర్‌ను పట్టుకున్నారు.

రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతులను ఉన్నతాధికారులకు పంపాలని కోరగా అందుకు రూ.40 వేలు డిమాండ్ చేసి రూ.35వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి ఎగ్జామినర్‌ను పట్టుకుని అరెస్టు చేసి నాంపల్లి కోర్టులో హాజరు పరుచగా జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు.

# ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్‌కి ప్రధాని మోదీ ఫోన్

న్యూఢిల్లీ, మార్చి 5:అంతర్జాతీయంగా పశ్చిమాసియాలో నెలకొన్న తాజా పరిస్థితులపై ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ కి ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్ చేశారు. యుద్ధ వాతావరణం, తాజా పరిస్థితులపై ఆయనతో మోదీ ఫోన్ ద్వారా చర్చలు జరిపారు. ప్రస్తుతం పెరుగుతున్న యుద్ధ ఉద్రిక్తతలపై పలు కీలక విషయాలు సంభాషించారు. ఈ భేటీకి సంబంధించిన వివరాలను ప్రధాని స్వయంగా సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' (ట్విట్టర్) ద్వారా వెల్లడించారు.

'ఈరోజు నా స్నేహితుడు అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌తో మాట్లాడాను. పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితిపై మా ఉమ్మడి ఆందోళనలు వెలిబుచ్చాం. దీనికి చర్చలు, దౌత్యమే మార్గమని మేము చర్చించాం. ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం పునరుద్ధరణ అవసరం. ఈ విషయం గురించి మరింత చర్చలు జరుపుతాం. త్వరగా శాంతి నెలకొనేలా ప్రయత్నాలు చేస్తాం. ఫ్రాన్స్‌తో భారత్ సమన్వయం కొనసాగుతుంది' అని ప్రధాని మోదీ తన 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు.

# మార్చి 17న శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం.. వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుపతి, మార్చి5: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మార్చి 19న ఉగాది ఆస్థానం సందర్భంగా మార్చి 17న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు.

కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కారణంగా మార్చి 17న వీఐపీ బ్రేక్ దర్శనాలు, అష్టదళ పాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసిందన్నారు. 16న ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించబడవని వెల్లడించారు. అదేవిధంగా మార్చి 19న ఉగాది ఆస్థానం సందర్భంగా ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా విఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేశామని వివరించారు. ఈ కారణంగా మార్చి 18న విఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించబడవని వివరించారు.

# స్పెయిన్‌లోని బార్సిలోనాలో జరుగుతున్న మొబైల్ వరల్డ్ కాంగ్రెస్-2026లో భారత దేశ కార్యకలాపాలకు నేతృత్వం వహిస్తున్న కేంద్ర మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య ఎం. సింధియా

న్యూఢిల్లీ, మార్చి 5:స్పెయిన్లోని బార్సిలోనాలో జరుగుతున్న మొబైల్ వరల్డ్ కాంగ్రెస్-2026లో భారత దేశ కార్యకలాపాలకు కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య ఎం. సింధియా నాయకత్వం వహిస్తున్నారు. జీఎస్ఎంఏ మంత్రివర్గ కార్యక్రమం, ఎండబ్ల్యూసీ లాంటి ప్రధాన వేదికల్లో ఉన్నత స్థాయి భాగస్వామ్యంతో, సరసమైన, సమగ్రమైన, భవిష్యత్తుకు అనుగుణంగా ఉన్న డిజిటల్ అనుసంధానత విషయంలో భారత్ ప్రణాళికను వివరించారు.

జీఎస్ఎంఏ మంత్రివర్గ కార్యక్రమం ముగింపు ఉపన్యాసం: "ధరల అవరోధాన్ని అధిగమించడం"

"బ్రేకింగ్ ది కాస్ట్ బ్యారియర్" అంశంతో నిర్వహించిన మంత్రివర్గ కార్యక్రమం ముగింపు ఉపన్యాసంలో శ్రీ సింధియా కీలక విషయాలను పంచుకున్నారు. అర్థవంతమైన డిజిటల్ భాగస్వామ్యం నుంచి అంతర్జాతీయంగా 3.1 బిలియన్ల మంది ప్రజలను దూరంగా ఉంచుతున్న ధరల సవాళ్లను పరిష్కరించడంపై ఈ కార్యక్రమంలో దృష్టి సారించారు.

డిజిటల్ సమ్మిళిత్వంలో పరికరాలు, సేవలు అందుబాటు ధరల్లో ఉండటవే ప్రధాన కేంద్రంగా ఉంటాయని స్పష్టం చేస్తూ. వినియోగ అంతరాన్ని తక్షణమే పూడ్చాల్సిన అవసరాన్ని మంత్రి వివరించారు.

"అనుసంధానత నిజంగా పరివర్తనాత్మకంగా ఉండాలంటే.. అది సార్వత్రికంగా అందుబాటులో ఉండాలి. మన ముందున్న సవాలు సాంకేతికత అందుబాటులో లేకపోవడం కాదు. బిలియన్ల మందిని డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భాగం కాకుండా అడ్డుకుంటున్న ధరలే" అని కేంద్ర మంత్రి అన్నారు.

విధాన సంస్కరణలు, పోటీ, విస్తరణ ద్వారా ధరలను తగ్గించడంలో భారత్ అనుభవాన్ని ఆయన వివరించారు. "విస్తరణ, ఆవిష్కరణ, స్థిరమైన విధాన వ్యవస్థలు నాటకీయంగా ధరలు తగ్గిస్తాయని భారత డిజిటల్ ప్రయాణం తెలియజేస్తోంది. 5జీ నుంచి 6జీ వ్యవస్థలకు మారుతున్న తర్వాతి తరం కనెక్టివిటీని అందరికీ అందుబాటులో, సమ్మిళితంగా, విస్తరించదగినదిగా ఉంచేలా చేయడమే మనందరి సమష్టి బాధ్యత కావాలి" అని తెలిపారు.

అందుబాటు ధరలకు పరికరాలను, ఆవిష్కరణాత్మక ఆర్థిక విధానాలను, సుస్థిరమైన డిజిటల్ వ్యవస్థలను తీసుకురావడానికి ప్రభుత్వాలు, పరిశ్రమలు, ఆర్థిక సంస్థలు, అంతర్జాతీయ సంస్థల మధ్య సమన్వయం, బహుళ భాగస్వామ్యంతో కూడిన విధానానికి శ్రీ సింధియా పిలుపునిచ్చారు.

అదే రోజు సాయంత్రం ఎండబ్ల్యూసీ మెయిన్ స్టేజిలో "బిల్ట్ ఫర్ వాట్స్ నెక్స్ట్" అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో కీలకోపన్యాసం చేశారు. ఈ ప్రసంగంలో ఏఐ, క్లౌడ్-నేటివ్ సాంకేతికతలు, అత్యాధునిక మౌలికవసతులపై ఆధారపడి ఉన్న తెలివైన, స్వీకరించదగిన, మానవ-కేంద్రీకృత వేదికలుగా నెట్‌వర్క్‌ల పరిణామంపై దృష్టి సారించారు.

ఓ పరికరం స్థాయి నుంచి అవకాశాలను అందించే, ఆవిష్కరణలను, ఆర్థిక వృద్ధిని, సామాజిక సాధారికతను నడిపించే శక్తిమంతమైన చోదకశక్తిగా మారిన కనెక్టివిటీ పరిణామక్రమాన్ని కేంద్ర మంత్రి వివరించారు.

"నెట్వర్కులు తెలివిగా, స్వతంత్రంగా, ముందుచూపు కలిగినవిగా ఉండే యుగంలోకి మనం వెళుతున్నాం. పౌరులు కనెక్టివిటీని ఎలా పొందుతున్నారో, సంస్థలు ఆవిష్కరణలను ఎలా చేస్తున్నాయో ఏఐ-ఆధారిత వ్యవస్థలు, క్లౌడ్-నేటివ్ ఆర్కిటెక్చర్లు, సురక్షితమైన డిజిటల్ వ్యవస్థలు పునర్నిర్వచిస్తున్నాయి" అని తెలిపారు.

అలాగే, "వేగానికి మాత్రమే అనుసంధానత భవిష్యత్తు పరిమితం కాలేదు. ఎలాంటి అవరోధాలు లేని డిజిటల్ అనుభవాలు, స్థిరమైన మౌలిక వసతులు, సుస్థిర వృద్ధిలో ఉంది. సాంకేతికత.. వ్యక్తులను శక్తిమంతం చేయాలి. వ్యాపారాలను బలోపేతం చేయాలి. సమాజాలు అభివృద్ధి చెందే వీలు కల్పించాలి" అని చెప్పారు.

సురక్షితమైన, విశ్వసనీయమైన, అంతర్జాతీయంగా పోటీనిచ్చే డిజిటల్ మౌలిక వసతులను నిర్మించడంలో భారత దేశ అంకితభావాన్ని ఈ ప్రసంగం పునరుద్ఘాటించింది.

విస్తరిస్తున్న భారతీయ టెలికాం తయారీ రంగం సామర్థ్యాలను, ఆవిష్కరణ వ్యవస్థను ప్రదర్శించే భారత్ పెవిలియన్ ప్రారంభం మరో ఆకర్షణ. ఈ పెవిలియన్ ద్వారా ఈ ఏడాది ఎండబ్ల్యూసీలో 40 భారతీయ సంస్థలు, ఆవిష్కర్తలు పాల్గొంటున్నారు.

4జీ, 5జీ రేడియో నెట్‌వర్క్‌లు, ఆప్టికల్ ట్రాన్స్‌పోర్ట్ వ్యవస్థలు, ఐపీ/ఎంపీఎల్ఎస్ రూటింగ్, బ్రాడ్‌బ్యాండ్ యాక్సెస్, శాటలైట్ కమ్యూనికేషన్లు, ఏఐ-ఆధారిత నెట్వర్క్ నిర్వహణ, ఐవోటీ అప్లికేషన్లు, సెమీకండక్టర్-ఎనేబుల్డ్ హార్డ్‌వేర్, భవిష్యత్తు తరం డేటా సెంటర్లు, క్లౌడ్ మౌలిక సదుపాయాల్లో పరిష్కారాలను అందించే భారతీయ అగ్ర సంస్థలను ఈ పెవిలియన్ ఒక్కచోట చేర్చింది.

డిజైన్ ఆధారిత తయారీ కేంద్రంగా, తక్కువ ఖర్చుతో కూడిన, సురక్షితమైన అనుసంధాన పరిష్కారాలను అందించే విశ్వసనీయమైన ప్రపంచ భాగస్వామిగా భారత్ ఆవిర్భావాన్ని ఈ పెవిలియన్ ప్రతిబింబిస్తుంది.

జీఎస్ఎంఏ ఇన్‌సైట్స్ హబలో ఇండియన్ మొబైల్ కాంగ్రెస్-2026 కర్టెన్ రైజర్‌ను కేంద్ర మంత్రి ఆవిష్కరించారు. న్యూఢిల్లీలో 2026 అక్టోబర్ 7 నుంచి 10 వరకు ఐఎంసీ-2026 జరుగుతుందని ప్రకటించారు. ఇది అధునాతన టెలీకమ్యూనికేషన్లు, ఏఐ-ఆధారిత నెట్‌వర్కులు, నూతన డిజిటల్ సాంకేతికతలకు అంతర్జాతీయ వేదికగా భారత్ పాత్రను మరింత బలోపేతం చేస్తుంది.

తేజస్ నెట్‌వర్క్స్ బూత్‌ను సందర్శించినప్పుడు టీజే1600-డీ3 హైపర్ స్కేలబుల్ డీసీఐ ప్లాట్‌ఫాంను ప్రారంభించారు. ఇది భారత్‌లో తయారైన అధునాతన ఆప్టికల్ నెట్‌వర్కింగ్ పరిష్కారాల్లో ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. అధిక సామర్థ్యం కలిగిన డేటా సెంటర్ ఇంటర్ కనెక్ట్ టెక్నాలజీల్లో పెరుగుతున్న భారతదేశ సామర్థ్యాలను ఈ ప్రారంభం తెలియజేస్తుంది.

ఎండబ్ల్యూసీ ఎరీనాను సందర్శిస్తున్న సమయంలో ఐటీయూ సెక్రటరీ జనరల్ డోరీన్ బోగ్డాన్ మార్టిన్‌తో సంభాషించే అవకాశం కేంద్ర మంత్రికి లభించింది. జీఎస్ఎంఏ మంత్రి వర్గ కార్యక్రమాల్లో పాల్గొన్నందుకు, అంతర్జాతీయ వేదికపై శక్తిమంతమైన భారత టెలికాం వ్యవస్థ, డిజిటల్ పరివర్తనాత్మక ప్రయాణాన్ని వివరించినందుకు కేంద్ర మంత్రిని ఐటీయూ ఎస్‌జీ అభినందించారు.

భారత్‌లో సార్వత్రికమైన, అర్థవంతమైన, స్థిరమైన అనుసంధాన వ్యవస్థలను ముందుకు తీసుకెళ్లే చర్యలను అర్థం చేసుకోవడానికి యూటెల్ శాట్, వయా శాట్‌తో ద్వైపాక్షిక చర్చలను మంత్రి నిర్వహించారు. భారత దేశమంతటా సురక్షితమైన, అధిక వేగంతో కూడిన, సార్వజనీనమైన, అర్థవంతమైన అనుసంధానాన్ని అందించడం కోసం మంత్రి దార్శనికతను రెండు సంస్థలు అభినందించాయి.

భారతదేశ డిజిటల్ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడంలో ప్రభుత్వానికి, పరిశ్రమకు మధ్య ఉన్న సమన్వయాన్ని మరింత బలోపేతం చేస్తూ సునీల్ భారతీ మిట్టల్ నేతృత్వం వహిస్తున్న భారతీ గ్రూపు ప్రతినిధులతో సైతం శ్రీ సింధియా సమావేశమయ్యారు.

పలు అగ్ర అంతర్జాతీయ సంస్థలు ఏర్పాటు చేసిన బూత్‌లను శ్రీ సింధియా సందర్శించి ఆయా నాయకత్వ బృందాలతో చర్చించారు. ఏఐ ఆధారిత, ధరించగలిగిన, న్యూరల్ ఇంటర్‌ఫేస్ టెక్నాలజీల గురించి మెటా బూత్ వద్ద మంత్రికి వివరించారు. అలాగే మెటా రే-బ్యాన్ డిస్‌ప్లేను పరీక్షించారు. శబ్దాలతో నిండిన లేదా రద్దీగా ఉండే వాతావరణంలో ఎదుటి వ్యక్తి స్వరాన్ని వేరు చేసేలా ఈ కళ్లద్దాల్లో ఉపయోగించిన 'కన్వర్జేషన్ ఫోకస్' ఫీచర్‌ను కూడా ఆయన పరీక్షించారు.

అవసరానికి తగినట్టుగా 5జీని విస్తరించే సాఫ్ట్‌వేర్ నిర్వచిత ఏఐ-నేటివ్ నెట్‌వర్క్ ఆర్కిటెక్చర్లను రకుటన్ వద్ద మంత్రి పరిశీలించారు. ఆ సంస్థ సీఈవో హిరోషి మికిటనీను కూడా కలుసుకున్నారు. వీవీడీఎన్ టెక్నాలజీస్ వద్ద దేశీయ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ఏఐ ఆధారిత వై-ఫై, నెట్‌వర్క్ పరిష్కారాలను చూశారు.

ఎరిక్సన్ బోర్డ్ ఛైర్మన్ జాన్ కార్ల్సన్‌తో ఎరిక్సన్ బూత్ వద్ద కేంద్ర మంత్రి ముచ్చటించారు. అధునాతన నెట్‌వర్క్ సాంకేతికతలు, నూతన 6జీ సామర్థ్యాలపై ఇచ్చిన ప్రదర్శనలను తిలకించారు. మూడు ప్రధానాంశాలను ఇక్కడ ప్రదర్శించారు: సీఎంవేవ్‌పై 6జీ డేటా కాల్, అనుభవపూర్వకమైన 6జీ ప్రదర్శనలు, భారతీయ అవసరాలకు అనుగుణంగా తయారు చేసిన కొత్త రేడియో పరిష్కారాలు.

నోకియా సందర్శన సందర్భంగా, జెనరేటివ్ ఏఐ-ఎనేబుల్డ్ ఎడ్జ్ అప్లికేషన్లు, ఇమ్మర్సివ్ 6జీ వినియోగ ప్రయోజనాలను పరిశీలించారు. నోకియా బూత్‌లో నోకియా అధ్యక్షుడు, సీఈఓ జస్టిన్ హోటార్డ్‌తో సమగ్ర చర్చ చేపట్టారు.

అత్యాధునిక ప్రాసెసర్ల శక్తి నిండిన ఏఐ-ఆప్టిమైజ్డ్ వర్చువల్ ర్యాన్ పరిష్కారాలను ఇంటెల్ బూత్‌లో శ్రీ సింధియా పరిశీలించారు.

సిస్కో సందర్శనలో భాగంగా ఏఐ-ఆధారిత ఎడ్జ్ కంప్యూటింగ్, నెట్వర్క్ ఆటోమేషన్ ప్రదర్శనలను తిలకించారు. అలాగే క్వాల్కమ్ వద్ద ఏఐ-ఆధారిత ర్యాన్ ఆటోమేషన్, అధునాతన 5జీ ఆధునిక వ్యవస్థలు, ఎడ్జ్ ఏఐ వేదికల గురించి మంత్రికి వివరించారు.

అంతకు ముందు, ఎండబ్ల్యూసీ-2026 వద్ద భారత్ కార్యకలాపాలను కేంద్ర మంత్రి ప్రారంభించారు. 2026 మార్చి 2న ప్రపంచ, భారతీయ సీఈవోలతో అత్యున్నత స్థాయి విందుతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. డిజిటల్ భాగస్వామ్యాలను బలోపేతం చేయడం, ఆవిష్కరణలను వేగవంతం చేయడం, విశ్వసనీయమైన సాంకేతిక వ్యవస్థలను ప్రోత్సహించడంపై ఆలోచనలను పంచుకొనే అవకాశాన్ని భారత్ ఆతిథ్యమిచ్చిన ఈ విందు అందించింది.

మొబైల్ వరల్డ్ కాంగ్రెస్-2026లోని కార్యక్రమాలు టెలీకమ్యూనికేషన్లు, డిజిటల్ ఆవిష్కరణల్లో భారత్‌కున్న బలమైన అంతర్జాతీయ భాగస్వామ్యాలను ప్రతిబింబిస్తాయి. అలాగే సమ్మిళిత వృద్ధి కోసం సురక్షితమైన, చౌకయిన, భవిష్యత్తుకు అనుగుణమైన అనుసంధాన వ్యవస్థలను నిర్మించడంలో దేశ చిత్తశుద్ధిని పునరుద్ఘాటిస్తాయి.

టెలికాం ఎక్విప్‌మెంట్ అండ్ సర్వీసెస్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (టీఈపీసీ) ఆధ్వర్యంలో భారత టెలికమ్యూనికేషన్ల విభాగం (డీవోటీ), కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ మద్దతుతో ఎండబ్ల్యూసీ-2026లో భారతీయ టెలికాం ఆవిష్కర్తలు పాల్గొంటున్నారు.

స్పెయిన్లోని బార్సిలోనాలో ఫిరా బార్సిలోనా గ్రన్ వియాలో 2026 మార్చి 2 నుంచి 5 వరకు మొబైల్ వరల్డ్ కాంగ్రెస్-2026 జరుగుతుంది. ప్రపంచంలోనే అతి పెద్ద మొబైల్, టెక్నాలజీ పరిశ్రమ సమావేశంగా జీఎస్ఎంఏ నిర్వహించిన ఎండబ్ల్యూసీ-2026 నిలిచింది. దాదాపు 109,000 మంది సందర్శకులను, సుమారుగా 2,900 మంది ఎగ్జిబిటర్లు, ప్రాయోజకులు, భాగస్వాములను ఈ కార్యక్రమం ఆకర్షించింది.

ఎండబ్ల్యూసీ-2026 అధికారిక ఇతివృత్తం "ది ఐక్యూ ఎరా". తెలివైన నెట్‌వర్కులను, వ్యాపార ఆవిష్కరణలను, సామాజిక ప్రభావాన్ని ముందుకు నడిపించేందుకు కృత్రిమ మేధ, అనుసంధానత ఏకీకరణను ఇది తెలియజేస్తుంది.

టెలికాం పరికరాలు, సేవల ఎగుమతులను ప్రోత్సహించి, అభివృద్ధి చేయడానికి భారత విదేశీ వాణిజ్య విధానం (ఎఫ్‌టీపీ) పరిధిలో, టెలికాం ఎక్విప్‌మెంట్ అండ్ సర్వీసెస్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (టీపీఈసీ)ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

భారత్ నుంచి టెలికాం ఎగుమతులను పెంపొందించడంలో, సభ్యత్వమున్న సంస్థలకు ఎగుమతులను సులభతరం చేయడంలో టీఈపీసీ కీలకపాత్ర పోషిస్తుంది. సంపూర్ణ టెలికాం పరిష్కారాలను అభివృద్ధి చేసి పంపిణీ చేయడంలో భారత ప్రభుత్వానికి చెందిన వివిధ విభాగాలతో పాటు భారతీయ టెలికాం ఎగుమతిదారుల మొత్తం వ్యవస్థతో కలసి టీఈపీసీ కలసి పనిచేస్తుంది.

# ఇంటర్ పరీక్షలో మాల్ ప్రాక్టీస్ చేస్తూ ఐదుగురు విద్యార్థులు పట్టివేత



హైదరాబాద్, మార్చి5: రాష్ట్రంలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి . గురువారం ఇంటర్ మొదటి సంవత్సరం జ్యూలజీ , హిస్టరీ పరీక్షలు జరిగాయి . ఈ పరీక్షలో 5 గురు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్ చేస్తూ పట్టుబడ్డారు.

పెద్దపల్లి జిల్లాలో ముగ్గురు, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలో ఒక్కొక్కరు చొప్పున పట్టుబడ్డారని అధికారులు వివరించారు. గురువారం నాటి పరీక్షలో మొత్తం 4,29,600 మంది విద్యార్థులకు గాను 4,17,656 మంది హాజరయ్యారు. 11,944 మంది గైర్హాజరయ్యారని పరీక్షల అధికారులు వివరించారు.

# జనాభా లెక్కలు-2027 కోసం డిజిటల్ సాధనాలు, ప్రగతి (మహిళ), వికాస్ (పురుష) మస్కట్‌లను

## న్యూఢిల్లీలో లాంఛనంగా ఆవిష్కరించిన కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, మార్చి 5:జనగణన-2027 కోసం నాలుగు డిజిటల్ సాధనాలను కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా న్యూఢిల్లీలో ప్రారంభించారు. వీటితో పాటుగా ప్రగతి (మహిళ), వికాస్ (పురుష) జనాభా లెక్కల మస్కట్లను కూడా ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా గణన కార్యకలాపాలను సులభతరం చేసేందుకు అధునాతన డిజిటల్ ప్లాట్‌ఫారంలను సెంటర్ ఫర్ డెవలప్మెంట్ ఆఫ్ అడ్వాన్స్డ్ కంప్యూటింగ్ (సీ-డాక్) రూపొందించింది. కేంద్ర హోం కార్యదర్శి, భారతీయ రిజిస్ట్రార్ జనరల్, భారత జనాభా లెక్కల కమిషనర్‌తో సహా పలువురు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

2025 జూన్ 16న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ద్వారా జనగణన-2027ను నిర్వహించాలనే తన ఉద్దేశాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రపంచంలోనే అతి జనాభా లెక్కల కార్యక్రమమైన జనగణన-2027 రెండు దశల్లో జరుగుతుంది. తొలిసారి జనాభాను డిజిటల్ విధానంలో గణిస్తున్నారు. అలాగే మొదటిసారి సెల్ఫ్-ఎన్యూమరేషన్ అవకాశం అందుబాటులోకి తీసుకువచ్చారు.

'ప్రగతి', 'వికాస్' మస్కట్‌లు

జనాభా లెక్కలు-2027లో స్నేహపూర్వకమైన, సుపరిచితమైన ప్రతినిధులుగా 'ప్రగతి' (మహిళా ఎన్యూమరేటర్), 'వికాస్' (పురుష ఎన్యూమరేటర్) మస్కట్‌లను ఆవిష్కరించారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను మార్చాలనే సంకల్పాన్ని నెరవేర్చడంలో మహిళలు, పురుషుల సమాన భాగస్వామ్యానికి చిహ్నాలుగా ఈ మస్కట్‌లు నిలుస్తాయి. వీటి ద్వారా జనాభా లెక్కలు - 2027కు సంబంధించిన సమాచారం, లక్ష్యాలు, కీలకమైన సందేశాలను దేశవ్యాప్తంగా వివిధ వర్గాల్లో ప్రభావవంతంగా ప్రచారం చేస్తారు.

నాలుగు డిజిటల్ సాధనాలు

డిజిటల్ సాధనాల ద్వారా భారత దేశంలో నిర్వహిస్తున్న మొదటి జనాభా లెక్కలు ఇవి. నాలుగు డిజిటల్ వేదికలను కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా ప్రారంభించారు. అవి:

హౌస్ లిస్టింగ్ బ్లాక్ క్రియేటర్ (హెచ్‌ఎల్‌బీసీ) వెబ్ అప్లికేషన్: దేశవ్యాప్తంగా భౌగోళిక కవరేజీని అందించేలా ఉపగ్రహ చిత్రాలను ఉపయోగించి డిజిటల్ హౌస్ లిస్టింగ్ బ్లాకులను రూపొందించడానికి అధికారులకు వీలు కల్పించే వెబ్-మ్యాప్ అప్లికేషన్ ఇది

హెచ్‌ఎల్‌వో మొబైల్ అప్లికేషన్: గృహ నమోదు సమాచారాన్ని సేకరించి అప్‌లోడ్ చేయడానికి సురక్షితమైన ఆఫ్‌లైన్ మొబైల్ అప్లికేషన్ ఇది. సీఎంఎంఎస్ ద్వారా రిజిస్టరైన ఎన్యూమరేటర్లు మాత్రమే ఈ అప్లికేషన్‌ను ఉపయోగించగలుగుతారు. క్షేత్రస్థాయి నుంచి సర్వర్ వరకు సమాచార సరఫరాకు ఈ యాప్ వీలు కల్పిస్తుంది. అలాగే సంప్రదాయ విధానమైన కాగితపు పనిని తొలగిస్తుంది. గృహ నమోదుకు సంబంధించిన మొత్తం సమాచారాన్ని ఈ యాప్ ద్వారా సేకరిస్తారు. రిజిస్టర్ మొబైల్ నంబర్లను మాత్రమే ఉపయోగించి దీనిని ఆపరేట్ చేయవచ్చు. 16 ప్రాంతీయ భాషల్లో ఉన్న ఈ యాప్ ఆండ్రాయిడ్, ఐవోఎస్ ప్లాట్‌ఫాంలకు అనువుగా ఇది ఉంటుంది.

సెల్ఫ్-ఎన్యూమరేషన్ (ఎస్‌ఈ) పోర్టల్: మొదటిసారి స్వీయగణనను ప్రవేశపెడుతున్నారు. సురక్షితమైన వెబ్ ఆధారిత సౌకర్యమే ఈ ఎస్‌ఈ పోర్టల్ ద్వారా అర్హులైన వారు తమ ఇంటి సమాచారాన్ని క్షేత్ర స్థాయి కార్యకలాపాలు ప్రారంభం కావడానికి ముందే ఆన్‌లైన్లో సమర్పించడానికి ఇది అనుమతిస్తుంది. వివరాలు విజయవంతంగా సమర్పించిన తర్వాత ప్రత్యేకమైన సెల్ఫ్-ఎన్యూమరేషన్ ఐడీ (ఎస్‌ఈ ఐడీ) జనరేట్ అవుతుంది. ఈ స్వీయ-గణన గుర్తింపు (ఎస్‌ఈ ఐడీ)ను ఎన్యూమరేటర్‌కు ఇవ్వాలి. దీని ఆధారంగా సమాచారాన్ని ఎన్యూమరేటర్ ధ్రువీకరిస్తారు.

సెన్సస్ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ (సీఎంఎంఎస్) పోర్టల్: అన్ని పరిపాలనా స్థాయుల్లో జనాభా లెక్కలకు సంబంధించిన అన్ని కార్యకలాపాల ప్రణాళిక, నిర్వహణ, అమలు, పర్యవేక్షణకు సంబంధించిన రూపొందించిన కేంద్రీకృత, వెబ్-ఆధారిత డిజిటల్ వేదిక. ఇంటిగ్రేటెడ్ డ్యాష్ బోర్డు ద్వారా గణన పురోగతి, క్షేత్రస్థాయి పని తీరు, కార్యాచరణ సంసిద్ధతను సబ్-జిల్లా, జిల్లా, రాష్ట్ర స్థాయుల్లోని అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించవచ్చు.

జనాభా లెక్కలు-2027లో ఇంటింటికీ వెళ్లి సురక్షితమైన మొబైల్ అప్లికేషన్లతో డేటా సేకరణ జరుగుతుంది. అలాగే పూర్తి స్థాయి కవరేజీకి హామీ లభిస్తుంది. దీని కోసం దేశవ్యాప్తంగా 30 లక్షల కంటే ఎక్కువ మంది ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, జనాభా లెక్కల అధికారులు పనిచేస్తారు.

క్రమబద్ధంగా స్వీకరించిన సాంకేతికత.. ఆవిష్కరణను సమ్మిళిత్వంతో మిళితం చేస్తుంది. అలాగే జనగణన-2027ను కచ్చితమైనదిగా, సురక్షితమైనదిగా, సమగ్రంగా ఉండేలా చేస్తుంది.

మొదటి దశలో ఇంటి పరిస్థితులు, ఇంట్లోని సౌకర్యాలకు సంబంధించిన సమాచార సేకరణ జరుగుతుంది. రెండో దశలో దేశంలోని ప్రతి వ్యక్తికి సంబంధించిన జనాభా, సామాజిక, ఆర్థిక వివరాలు నమోదు చేస్తారు.

2026 జనవరి 7న మొదటి దశకు నోటిఫికేషన్ జారీ అయింది. 2026 ఏప్రిల్ 1 నుంచి 2026 సెప్టెంబర్ 30 మధ్య ప్రతి రాష్ట్రం/ కేంద్రపాలిత ప్రాంతం జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా హౌస్‌లిస్టింగ్, హౌసింగ్ లెక్కలు 30 రోజుల కాల వ్యవధిలో పూర్తి చేస్తారు. ఇంటింటి సర్వేకు ముందు ఐచ్ఛిక 15 రోజుల స్వీయ-గణన వ్యవధి ఉంటుంది. 2027 ఫిబ్రవరి నుంచి దేశవ్యాప్తంగా జనగణన ప్రారంభమవుతుంది. కేంద్రపాలిత ప్రాంతమైన లదాఖ్, జమ్ముకాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో మంచుతో కప్పబడి ఉండే ప్రాంతాల్లో 2026 సెప్టెంబర్‌లోనే ఎన్యూమరేషన్ జరుగుతుంది. రెండో దశ జనగణనలో కుల సంబంధిత ప్రశ్నను చేర్చనున్నారు.

కేంద్ర పాలిత ప్రాంతమైన లదాఖ్, జమ్ముకాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని మంచుతో కప్పబడి ఉండే ప్రాంతాల్లో తప్ప, మిగిలిన అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు జనాభా లెక్కల రిఫరెన్స్ తేదీ 2027 మార్చి1 00:00 గంటలుగా ఉంటుంది. పైనే పేర్కొన్న ప్రాంతాలకు మాత్రం రిఫరెన్స్ తేదీ 2026 అక్టోబర్ 1వ తేదీ 00:00 గంటలుగా ఉంటుంది

# మహిళపై సామూహిక అత్యాచారం.. ఇద్దరు అరెస్ట్

భువనేశ్వర్, మార్చి 5: మహిళ పిల్లల ముందే ఇద్దరు వ్యక్తులు ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఒక వ్యక్తి ఆ మహిళ చెంపపై గట్టిగా కొరికాడు. ఆ గాయం గురించి భర్త ఆరా తీయగా జరిగిన విషయం ఆమె చెప్పింది. ఈ నేపథ్యంలో పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ఒడిశాలోని కియోంఝర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఫిబ్రవరి 20న జోడా ప్రాంతానికి చెందిన ఒక మహిళ పండుగ వేడుక కోసం భాగల్పూర్ గ్రామానికి వెళ్లింది. సాయంత్రం వేళ పిల్లలతో కలిసి ఇంటికి తిరుగు ప్రయాణమైంది.

కాగా, రాత్రి 9 గంటల సమయంలో 34 ఏళ్ల బసుదేవ్ గగ్రై తన వాహనంలో ఇంటి వద్ద దింపుతానని చెప్పి ఆ మహిళ, ఆమె పిల్లలను ఎక్కించుకున్నాడు. అయితే ఏకాంత ప్రదేశానికి తీసుకెళ్లాడు. ఆమెను లైంగికంగా వేధించాడు. బిలేపాడ ప్రాంతానికి చెందిన 44 ఏళ్ల సుక్లాల్ ముండా కూడా అక్కడకు చేరుకున్నాడు. వారిద్దరూ కలిసి పిల్లల ముందే ఆ మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఒక వ్యక్తి ఆమె బుగ్గపై గట్టిగా కొరికాడు. ఈ విషయం ఎవరికీ చెప్పవద్దని ఆ మహిళను బెదిరించి అక్కడి నుంచి పారిపోయారు.

మరోవైపు బుగ్గపై కొరికిన గాయం వల్ల ఆ మహిళ చెంప వాచింది. దీంతో ఏమి జరిగిందని ఆమె భర్త పలుమార్లు అడిగాడు. చివరకు జరిగిన విషయాన్ని ఆ మహిళ చెప్పింది. ఈ నేపథ్యంలో మార్చి 3న భర్తతో కలిసి జోడా పోలీస్ స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితులైన బసుదేవ్, సుక్లాల్‌ను అరెస్ట్ చేశారు. వారిని కోర్టులో ప్రవేశపెట్టిన తర్వాత జైలుకు తరలించినట్లు పోలీస్ అధికారి తెలిపారు.

# సెలవు నిరాకరించిన అధికారి.. పరిస్థితి వివరించేందుకు ప్యాంటు విప్పిన రైల్వే ఉద్యోగి

లక్నో, మార్చి 5: రైల్వేలో లోకో పైలట్‌గా పని చేస్తున్న వ్యక్తి పైల్స్‌తో బాధపడుతున్నాడు. దీనికి సర్జరీ చేయించుకున్నాడు. కోలుకోకపోవడంతో సెలవు పొడిగించాలని కోరాడు. అధికారి నిరాకరించడంతో తన పరిస్థితిని వివరించేందుకు ప్యాంటు విప్పి చూపించాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో ఈ సంఘటన జరిగింది. రైల్వేలో లోకో పైలట్‌గా రాజేష్ మీనా పని చేస్తున్నాడు. చాలా కాలంగా పైల్స్‌తో అతడు బాధపడుతున్నాడు. ఫిబ్రవరి 22న లక్నోలోని ఆసుపత్రిలో సర్జరీ చేయించుకున్నాడు. దీని కోసం ఫిబ్రవరి 28 వరకు సెలవు పొందాడు.

కాగా, రాజేష్ మీనాకు మంజూరు చేసిన సెలవులు ముగిశాయి. అయితే పైల్స్‌కు చేసిన సర్జరీ గాయం మానలేదు.

# కౌమార యువతకు వరంగా మారిన లయన్స్ క్వెస్ట్ జీవన నైపుణ్యాల శిక్షణ

### - జిల్లా గవర్నర్ సింహరాజు కోదండరామ్




హైదరాబాద్, మార్చి5:లయన్స్ క్లబ్ కరీంనగర్ శాతవాహన నేతృత్వంలో లయన్స్ కెప్టెన్ బుర్ర మధుసూధన్ రెడ్డి సమన్వయకర్తగా సిద్ధార్థ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ భగత్నగర్ పాఠశాల యందు జులై 13,14 తేదీలలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు జీవన నైపుణ్యాలను విద్యార్థులకు నేర్పించారు. పిల్లల్లో కౌమార దశలో జరిగే పరిణామాలను, నాయకత్వ లక్షణాల పెంపును నిర్వహించి 6, 7, 8 తరగతులకు ఈ విద్యాసంవత్సరం 40 పీరియడ్స్ నిర్వహించి పిల్లల్లో భావోద్వేగాల నియంత్రణ, సామాజిక అవగాహన, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, సహచరుల ప్రభావం, ప్రాబ్లమ్ సాల్వింగ్, వ్యక్తిత్వ వికాసం లాంటి జీవన నైపుణ్య అంశాలను బోధించడం జరిగిందని లయన్స్ జిల్లా గవర్నర్ వివరించారు. ఈ కార్యక్రమంలో కౌమార యువత నైపుణ్య శిక్షణ శిక్షణ పొందిన విద్యార్థులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. అలాగే శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు కూడా తమ సంతోషాన్ని వెలిబుచ్చారు. సిద్ధార్థ పాఠశాలల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ లైఫ్ స్కిల్స్ బోధన తర్వాత విద్యార్థుల్లో సానుకూల మార్పులు వచ్చాయని, ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని రానున్న విద్యాసంవత్సరంలో మెరుగైన కార్యాచరణతో కొనసాగిస్తామని అన్నారు. ఈ రోజు అనగా మార్చి 5వ తేది గురువారము రోజున స్థానిక మంకమ్మతోటలోని సిద్ధార్థ పాఠశాలలో 8వతరగతి విద్యార్థులకు మనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి 400 విద్యార్థినీవిద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లయన్ సింహరాజు కోదండరామ్, విశిష్ట అతిథులుగా సిద్ధార్థ పాఠశాలల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి, అనంతుల శివ ప్రసాద్, ముచ్చ రాజిరెడ్డి, సింగిరెడ్డి వాసుదేవ రెడ్డి, గాలిపెల్లి వెంకట్, ఎనుగుర్తి రమేష్, పోతాని ప్రవీణ్ కుమార్, బుర్ర మధుసూధన్ రెడ్డి, వి. జగదీశ్వర చారి, వి. శశికాంత్ వర్మ పాల్గొనగా శాతావాహన క్లబ్ అధ్యక్షుడు దాసరి తిరుపతి రెడ్డి, కార్యదర్శి గాండ్ల చంద్రశేఖర్, కోశాధికారి పచ్చునూరి సురెందర్ పాల్గొనగా పాఠశాల ఉపాధ్యాయులు, 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ బాధ్యులను సిద్ధార్థ పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది.

# మహిళల భద్రత కోసం షీ టీమ్స్ : జిల్లా ఇన్‌చార్జి ఉషారాణి




ఆదిలాబాద్, మార్చి 5: మహిళల భద్రత కోసమే షీ టీమ్స్‌పనిచేస్తున్నాయని మంచిర్యాల జిల్లా షీ టీమ్ ఇన్‌చార్జి ఎస్సై ఉషారాణి అన్నారు. మండలంలోని రేచిని జడ్పీహెచ్‌ఎస్ లో విద్యార్థులకు డ్రగ్స్, షీ టీమ్ మీద నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.

మహిళా చట్టాలు, డ్రగ్స్ వలన కలిగే అనర్థాలు, షీ టీమ్ ప్రాముఖ్యత , మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టాలు, బాల్య వివాహాలు దాని పరిణామాల గురించి, ఈవ్ టీజింగ్, టీ సేఫ్ అప్లికేషన్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్స్, సైబర్ హెల్ప్ లైన్ నంబర్, డయల్ 100 ప్రాముఖ్యత, సమాజ రుగ్మతల గురించి వివరించారు. ఎవరైనా మహిళలను వేధించినా, రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేళనగా మాట్లాడినా ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే 100 , రామగుండం షీ టీమ్ నెంబర్ 6303923700 కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా షీ టీమ్ కానిస్టేబుల్స్ శ్రవణ్, జ్యోతి, పాఠశాల హెడ్ మాస్టర్ ప్రదీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వివిధ విభాగాల్లో అత్యుత్తమ సేవలు అందించిన 26 మంది యువ వైద్య నిపుణులకు అవార్డులను ప్రదానం చేసిన కేంద్రమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్




న్యూఢిల్లీ, మార్చి 5:దేశవ్యాప్తంగా ఉన్న 26 మంది యువ వైద్య నిపుణులకు కేంద్ర శాస్త్ర సాంకేతిక, భూ విజ్ఞాన శాస్త్రాల శాఖ మంత్రి, పీఎంఓ, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు, అణుశక్తి, అంతరిక్ష శాఖల సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) డాక్టర్ జితేంద్ర సింగ్ నేడు అవార్డులను ప్రదానం చేశారు. అంకాలజీ, పీడియాట్రిక్స్, ఎండోక్రినాలజీ, ఆర్థోపెడిక్స్, ఎమర్జెన్సీ మెడిసిన్ వంటి వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఈ గుర్తింపు లభించింది.

ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన మీడియా సంస్థను డాక్టర్ జితేంద్ర సింగ్ అభినందించారు. తమ వృత్తిలో కీలక దశలోకి అడుగుపెడుతున్న వైద్యులకు అవార్డులు ఇవ్వాలని తీసుకున్న నిర్ణయాన్ని ఆయన ప్రశంసించారు. కెరీర్ చివరి దశలో వచ్చే అవార్డుల కంటే ఈ వయసులో లభించే అవార్డు గొప్ప గుర్తింపును ఇవ్వడమే కాకుండా వారికి ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తుందని పేర్కొన్నారు.

దేశంలో వైద్య సేవలను భవిష్యత్తులో మరింత బలోపేతం చేయడానికి యువ వైద్యులను వారి వృత్తి ప్రారంభ దశలోనే గుర్తించడం చాలా ముఖ్యమని మంత్రి అన్నారు. వైద్య నిపుణులను వారి ఎదుగుదల దశలో ప్రోత్సహించడం వల్ల నిరంతరం మారుతున్న వైద్య రంగంలో అద్భుతమైన ప్రతిభను చాటడానికి, తమ జ్ఞానాన్ని ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవడానికి వారికి అవకాశం లభిస్తుందని తెలిపారు.

సమావేశాన్ని ఉద్దేశించి కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో ప్రదానం చేసిన అనేక పురస్కారాల్లో చాలా వరకు కెరీర్ ముగింపులో ఉన్న సీనియర్ నిపుణులకు కాకుండా యువ వైద్యులకు దక్కడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిభను ప్రారంభ దశలోనే గుర్తించడం వల్ల వారిలో ఆత్మవిశ్వాసం పెరగడమే కాకుండా, సమాజానికి మరింత నిబద్ధతతో సేవలు అందించేలా యువ వైద్య నిపుణులకు స్ఫూర్తినిస్తుందని మంత్రి వ్యాఖ్యానించారు.

వైద్య వృత్తిలో వస్తున్న మార్పుల గురించి డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రసంగించారు. నూతన సాంకేతికతలు, కృత్రిమ మేధ రాకతో ఆరోగ్య సంరక్షణ రంగం విప్లవాత్మక మార్పులకు లోనవుతోందని అన్నారు. సాంకేతికత వల్ల వ్యాధి నిర్ధారణ, చికిత్స గణనీయంగా మెరుగుపడినప్పటికీ, వైద్యుని పాత్ర ఎప్పటికీ భర్తీ చేయలేనిదని ఆయన స్పష్టం చేశారు. రోగి సంరక్షణలో అనుభవం, క్లినికల్ అవగాహన ఇప్పటికీ కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు.

వైద్య శాస్త్రంలో దశాబ్దాలుగా జరుగుతున్న పరిణామాలను గమనించిన కేంద్రమంత్రి తన అనుభవాన్ని పంచుకున్నారు. గతంలో వైద్య విద్య అనేది మొత్తం వైద్య రంగాన్ని అర్థం చేసుకోవడానికి సిఫిలిస్, మధుమేహం వంటి నిర్దిష్ట వ్యాధుల గురించి లోతుగా అధ్యయనం చేయడం చుట్టూ తిరిగేదని డాక్టర్ జితేంద్ర సింగ్ గుర్తు చేసుకున్నారు. కానీ నేడు అనేక ప్రత్యేక విభాగాలు, కొత్త చికిత్సా పద్ధతులు అందుబాటులోకి రావడంతో వైద్య రంగ పరిధి అసాధారణంగా విస్తరించిందని తెలిపారు. సాంప్రదాయ అభ్యాస ప్రక్రియను కృత్రిమ మేధ భర్తీ చేసే ధోరణి కనిపిస్తోందని ఆయన అన్నారు.

సాంకేతిక పురోగతులు, కొత్తగా ఆవిర్భవిస్తున్న వ్యాధులు, మారుతున్న ఆరోగ్య సంరక్షణ అవసరాల కలయిక వైద్య రంగాన్ని గతంలో కంటే మరింత సంక్లిష్టంగా మార్చిందని మంత్రి అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వేగంగా అందుబాటులోకి వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి యువ వైద్యుడు వైద్యశాస్త్రంలోని ఒక నిర్దిష్ట విభాగంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ఎల్లప్పుడూ తమను తాము అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. వైద్య రంగంలో జ్ఞానం వేగంగా మారుతున్న నేపథ్యంలో నిరంతర అభ్యాసం ఎంతో అవసరమని ఆయన యువ వైద్యులకు హితవు పలికారు.

కోవిడ్ అనంతర ఆరోగ్య పరిస్థితుల గురించి డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రస్తావించారు. అటు అంటువ్యాధులు, ఇటు జీవనశైలి వ్యాధులు రెండూ ప్రస్తుతం ఆరోగ్య వ్యవస్థలకు సవాలుగా మారుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వైద్య నిపుణులకు ప్రత్యేక నైపుణ్యం, నిరంతర అభ్యాసం ప్రాముఖ్యత మరింత పెరిగిందని ఆయన అన్నారు.

ఈ సమావేశంలో సన్మానం పొందిన యువ వైద్యులపై విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ.. వారిలో చాలామంది తమ కెరీర్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని డాక్టర్ జితేంద్ర సింగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. వైద్య వృత్తికి చేసిన కృషికి జీవితకాల సాఫల్య గౌరవాలను అందుకోవడానికి భవిష్యత్తులో ఏదో ఒక రోజు మళ్లీ తిరిగి రావాలని అన్నారు.

# చెంపపై కొట్టిన పోలీస్.. బిల్డింగ్ పైనుంచి దూకి యువకుడు మృతి

ఇండోర్, మార్చి 5: రాత్రి వేళ ఇంటి నుంచి బయటకు వచ్చిన యువకుడు, సెక్యూరిటీ గార్డు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో అక్కడకు చేరుకున్న పోలీస్ అతడి చెంపపై కొట్టాడు. భయాందోళన చెందిన ఆ వ్యక్తి బిల్డింగ్ పైనుంచి దూకి మరణించాడు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈ సంఘటన జరిగింది. ఒక అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో నివసిస్తున్న 23 ఏళ్ల రాజ్ మక్వానా గురువారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో తన ఫ్లాట్ నుంచి బయటకు వచ్చాడు. ఆ కాంపెక్స్ బయట నడుస్తున్నాడు.

కాగా, రాజ్‌ను సెక్యూరిటీ గార్డు అడ్డుకున్నాడు. అర్ధరాత్రి వేళ ఇంటి నుంచి బయటకు ఎందుకు వచ్చావని ప్రశ్నించాడు. ఉక్కపోత వల్ల శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కారణంగా స్వచ్ఛమైన గాలి, వాకింగ్ కోసం బయటకు వచ్చినట్లు అతడు చెప్పాడు. వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో సెక్యూరిటీ గార్డు పోలీసులకు సమాచారం ఇచ్చాడు.

# మహిళల సాధికారత సమాజ అభివృద్ధికి కీలకం

### - కేయూ రిజిస్ట్రార్ వల్లూరి రాంచంద్రం

హన్మకొండ, మార్చి5: మహిళల సాధికారత సమాజ అభివృద్ధికి కీలకమని కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, ప్రొఫెసర్ వల్లూరి రాంచంద్రం అన్నారు. యూనివర్సిటీ ఆర్ట్స్-అండ్ సైన్స్- కాలేజీ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు.




ఆయన మాట్లాడుతూ విద్య, ఆర్థిక స్వావలంబన, సామాజిక చైతన్యం ద్వారా మహిళలు అన్ని రంగాలలో ముందుకు సాగుతున్నారన్నారు. గౌరవ అతిథిగా హాజరైన కేయూ విశ్రాంత ఆచార్యురాలు వి. శోభ మాట్లాడుతూ మహిళా విద్య ప్రాధాన్యతను వివరించారు. ఆధునిక సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర అత్యంత కీలకమని, విద్యావంతులైన మహిళలు కుటుంబం అభివృద్ధికి తోడ్పడటమే కాక సమాజానికి మార్గదర్శకుల వుతారని తెలిపారు.

ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి మాట్లాడుతూ విద్యార్థినులు ఆత్మవిశ్వాసం, నైపుణ్యాలు పెంపొందించుకోవడం ద్వారా సమాజంలో నాయకత్వ పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రెహ్మాన్, ఉమెన్ సెల్ కోఆర్డినేటర్ శ్రీలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


# అంతరాష్ట్ర బైక్ దొంగల అరెస్ట్..ఆరు బైకులు స్వాధీనం

నల్గొండ, మార్చి 5: పట్టణంలో వరుస బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగల ముఠాను హుజూర్ నగర్ పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి సుమారు లక్షల రూపాయల విలువ చేసే ఆరు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చరమంద రాజు వెల్లడించారు.

గురువారం పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో ఇద్దరు వ్యక్తులు హెచ్.ఎఫ్ డీలక్స్ బైక్‌పై అనుమానాస్పదంగా సంచరిస్తుండగా, ఎస్సై మోహన్ బాబు తన సిబ్బందితో కలిసి వారిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులను చూడగానే పారిపోయేందుకు ప్రయత్నించగా వారిని పట్టుకుని విచారించగా, దొంగతనాల అసలు విషయం వెలుగులోకి వచ్చిందన్నారు.

పోలీసుల విచారణలో నిందితులు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గుంటూరు జిల్లా మేడికొండూరు గ్రామానికి చెందిన షేక్ మాబు , షేక్ రిహాజ్‌గా గుర్తించామని తెలిపారు.

# కాలాన్ని మించిన కలం...ముక్తవరం పార్థసారథి



తెలుగు సాహిత్య లోకంలో మౌనంగా కానీ మర్మంగా తన ముద్రవేసిన ప్రముఖ రచయిత ముక్తవరం పార్థసారథి మరణం సాహిత్య ప్రపంచాన్ని శోకసంద్రంలో ముంచెత్తింది. పద్యానికి పౌరుషం, గద్యానికి గంభీరత, విమర్శకు వైచిత్ర్యం, వ్యాస రచనకు విలక్షణతను అందించిన ఈ సాహితీవేత్త ఇకలేరనే వార్త పాఠకుల హృదయాలను కలచివేసింది. ఆయన మరణం కేవలం ఒక రచయిత మృతి గాక, ఒక ఆలోచనా సంప్రదాయానికి, విలువలతో కూడిన సాహిత్య దృక్పథానికి ముగింపు చిహ్నంలా అనిపిస్తోంది. ఎనభై ఒక్క సంవత్సరాల వయసులో బుధవారం రాత్రి ఆయన తుది శ్వాస విడిచారు. తెలంగాణలోని భువనగిరి ప్రాంతంలో జన్మించిన ఈ మహనీయుడు తన జీవితాన్ని సాహిత్యానికి అంకితం చేసిన అరుదైన రచయితగా నిలిచారు.

ముక్తవరం పార్థసారథి తెలుగు సాహిత్య రంగంలో అరుదైన వ్యక్తిత్వం. గ్రామీణ వాతావరణంలో జన్మించి సాధారణ కుటుంబంలో పెరిగినా అసాధారణమైన పఠనాభిరుచి, పరిశీలనా దృష్టి, సాహిత్యం పట్ల ఉన్న అంకితభావం ఆయనను విశిష్ట రచయితగా తీర్చిదిద్దాయి. చిన్ననాటి నుంచే పుస్తకాలపై ఆసక్తి పెంచుకున్న ఆయన వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు, తాత్త్విక గ్రంథాలు, ప్రపంచ సాహిత్య రచనలు అన్నీ సమాన ఆసక్తితో అధ్యయనం చేశారు. ఈ విస్తార పఠనమే ఆయన రచనా శక్తికి పునాది అయింది. పఠనంతో పాటు అనువాదం అనే ప్రక్రియపై ఆయనకు ప్రత్యేక మక్కువ ఉండేది. ప్రపంచ సాహిత్యంలో ఉన్న గొప్ప భావజాలాన్ని తెలుగులోకి పరిచయం చేయడం ద్వారా పాఠకులకు విశాల దృష్టిని అందించాలనే సంకల్పం ఆయనలో కనిపించింది.

ఆయన రచనా ప్రస్థానం ప్రారంభం నుంచే వైవిధ్యంతో నిండింది. కథలు, నవలలు, వ్యాసాలు, విమర్శా రచనలు, సాహిత్య చరిత్ర, అనువాదాలు?ఏ ప్రక్రియలో నైనా ఆయన కలం సమర్థంగా నడిచింది. సాధారణంగా ఒక రచయిత ఒక ప్రక్రియ లోనే తన ప్రతిభను చాటుకుంటాడు. కానీ ముక్తవరం పార్థసారథి అనేక ప్రక్రియల్లో సమాన నైపుణ్యాన్ని ప్రదర్శించడం ఆయన ప్రత్యేకత. గద్యానికి ఆయన ఇచ్చిన నిగూఢత, పద ప్రయోగంలో చూపిన కట్టుదిట్టత, భావ వ్యక్తీకరణలో కనబరిచిన సరళత పాఠకులను ఆకట్టుకున్నాయి. అచ్చతెలుగు పదాల వినియోగం, భావ స్పష్టత, సంభాషణల సహజత్వం ఆయన రచనల ప్రధాన లక్షణాలు.

ఆయన కథల్లో సామాన్య మనిషి జీవితం ప్రతిఫలించింది. గ్రామీణ సమాజంలో జరిగే చిన్న చిన్న సంఘటనలను లోతైన మానసిక విశ్లేషణతో చిత్రించడం ఆయనకు అలవాటు. పాత్రల అంతర్మథనాన్ని అతి సహజంగా ఆవిష్కరించడంలో ఆయన ప్రత్యేక నైపుణ్యం కనిపిస్తుంది. మధ్య తరగతి జీవన శైలిలోని ఆత్మగౌరవం, అట్టడుగు వర్గాల జీవితంలోని పోరాటం, కుటుంబ బంధాలలోని సంక్లిష్టతలు, మానవ సంబంధాలలోని భావోద్వేగాల పరస్పర విరుద్ధతలు? ఇవన్నీ ఆయన కథల్లో సహజంగా మిళితమై ఉంటాయి. ఎక్కడా అతిశయోక్తి లేకుండా, అలంకారభరితతకు లోనుకాకుండా వాస్తవికతను కాపాడుతూ రచనలు చేయడం ఆయనకు అలవాటు.

ముక్తవరం పార్థసారథి కేవలం కథకుడే కాదు, విశిష్ట అనువాదకుడు కూడా. ప్రపంచ సాహిత్యంలో ప్రసిద్ధి చెందిన రచనలను తెలుగులోకి తీసుకువచ్చి పాఠకులకు పరిచయం చేశారు. అమెరికన్ రచయిత జాక్ లండన్ రచించిన "ఉక్కు పాదం" నవలను ఆయన తెలుగులోకి అనువదించడం విశేష ప్రాచుర్యం పొందింది. ఈ నవల ద్వారా వర్గ దోపిడీ స్వరూపం, సామాజిక అసమానతల నిర్మాణం, ప్రజా పోరాటాల అవసరం వంటి అంశాలను పాఠకులకు చేరువ చేశారు. అదే విధంగా ప్రపంచ రచయిత్రుల కథలను ఎంపిక చేసి సంకలనం చేసిన గ్రంథాలు కూడా ఆయన సాహిత్య సేవలో ముఖ్యమైనవి. వివిధ దేశాల కథలను ఎంపిక చేసి సంక్షిప్తీకరించి అందించిన "వంద కథలు", "కథల వాచకం - 14 దేశాలు, 20 కథలు" వంటి సంకలనాలు పాఠకులలో విశేష ఆదరణ పొందాయి.

ఆయన రచించిన నవలలలో "మనసులోని చలి" ప్రత్యేక ప్రస్తావనకు పాత్రమైనది. ఈ నవలలో మానవ మనస్సు లోని సంఘర్షణలను తాత్త్విక దృష్టితో విశ్లేషిస్తూ భావోద్వే గాలను లోతుగా చిత్రించారు. సహజమైన సంభాషణలు, జీవితానుభవాల ప్రతిబింబం, మానసిక విశ్లేషణలతో కూడిన ఈ రచన ఆయన ప్రతిభకు నిదర్శనం. అదే విధంగా "కించిద్విషాదం", "నువ్వా- నేనూ- చిన్నారావూ", "రంగుల వల", "పగిలిన అద్దం", "నోబెల్ తారలు" వంటి రచనలు ఆయన సాహిత్య విస్తృతిని తెలియ జేస్తాయి.

> ఆయన రచించిన నవలలలో "మనసులోని చలి" ప్రత్యేక ప్రస్తావనకు పాత్రమైనది. ఈ నవలలో మానవ మనస్సులోని సంఘర్షణలను తాత్త్విక దృష్టితో విశ్లేషిస్తూ భావోద్వేగాలను లోతుగా చిత్రించారు. సహజమైన సంభాషణలు, జీవితానుభవాల ప్రతిబింబం, మానసిక విశ్లేషణలతో కూడిన ఈ రచన ఆయన ప్రతిభకు నిదర్శనం.

**ప్రముఖ రచయిత ముక్తవరం పార్థసారథి మరణం సాహిత్య ప్రపంచానికి శోకం..**

ముక్తవరం పార్థసారథి కథలు అనేక పత్రికల్లో ప్రచురితమయ్యాయి. "చిట్టి ఏడుపు", "ఆ రాత్రి", "పరువు", "పాఠం", "నీలికళ్ళు", "పక్షి", "గాడిద" వంటి కథలు వివిధ పత్రికల్లో ప్రచురితమై పాఠకుల ప్రశంసలు పొందాయి. కొన్ని కథలు విదేశీ రచనల ఆధారంగా అనువదించ బడినప్పటికీ వాటిని తెలుగులో సహజంగా వినిపించేలా తీర్చిదిద్దడం ఆయన ప్రత్యేకత. ప్రపంచ తాత్త్వికులు, ఆలోచనా పరులు, రచయితల భావజాలాన్ని తెలుగులోకి పరిచయం చేయడంలో ఆయన చూపిన కృషి తెలుగు పాఠకుల దృష్టిని విస్తరించింది.

భాషపట్ల ఆయనకు అపారమైన గౌరవం ఉండేది. అచ్చతెలుగు పదాలను వినియోగించడంలో ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపేవారు. అనవసర విదేశీ పదాల వినియోగాన్ని నివారిస్తూ భాషను సహజంగా వినిపించేలా రాయడం ఆయనకు అలవాటు. అయితే ఆయన భాష కఠినంగా ఉండేది కాదు. సరళమైన పదాలతోనే లోతైన భావాలను వ్యక్తం చేయగలిగే శక్తి ఆయనకు ఉంది. అందుకే ఆయన రచనలు పండి తులకు మాత్రమే కాక సామాన్య పాఠకులకు కూడా చేరువయ్యాయి.

వ్యక్తిత్వ పరంగా ముక్తవరం పార్థసారథి మితభాషి, మృదు స్వభావి. ప్రచారం కోసం పరితపించని ఆయన తన రచనలే తన పరిచయమని భావించారు. సాహిత్య సభల్లో పాల్గొన్నప్పటికీ అతిశయోక్తి మాటలు మాట్లాడేవారు కాదు. యువ రచయితలను ప్రోత్సహించడం ఆయనకు ఎంతో ఇష్టం. తమ రచనలను పంపించిన యువకు లకు సూచనలు ఇచ్చి మార్గ నిర్దేశం చేసేవారు.

అనేక మంది యువ రచయితలు ఆయన ప్రోత్సాహంతో రచనా ప్రపంచంలోకి అడుగు పెట్టినట్లు చెబుతారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో కూడా ఆయనకు గౌరవాలు లభించాయి. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆయనకు సత్కారం లభించింది. ప్రజాశక్తి ప్రచురణలు ఆయన రచనలను పుస్తక రూపంలో తీసుకు వచ్చాయి. అనేక సాహిత్య సంస్థలు ఆయన సేవలను గుర్తించి గౌరవించాయి. అయినప్పటికీ ఆయనకు అవార్డులు, పురస్కారాలపై ప్రత్యేక ఆసక్తి ఉండేది కాదు. "రచన సమాజాన్ని తాకాలి; అవార్డులు రచయితను కాదు" అనే భావజాలాన్ని ఆయన తరచూ వ్యక్తం చేసేవారని ఆయనకు సన్నిహితులు చెబుతారు.

సామాజికంగా ఆయన ఒక విశాల దృష్టి గల రచయిత. వ్యక్తిగత సామాజిక వర్గ గుర్తింపులను అతిక్రమించి విశ్వమానవ దృష్టితో రచనలు చేయడం ఆయన ప్రత్యేకత. ఆయన పేరు సంస్కృత గంభీరతను సూచించినప్పటికీ, ఆయన ఆలోచన మాత్రం మానవీయతకు దగ్గరగా ఉండేది. అయితే పార్థసారథి మాత్రం తనను ఏ వర్గానికి పరిమితం చేసుకోకుండా విశ్వ సాహిత్య దృష్టితో రచనలు చేశారు.

ఆయన జీవితం ఎక్కువగా సాహిత్యంతోనే ముడిపడి ఉండేది. పుస్తకాలు చదవడం, రచనలు చేయడం, అనువాదాలు సిద్ధం చేయడం ఆయనకు నిత్యకృత్యాలుగా ఉండేవి.

ముక్తవరం పార్థసారథి మరణం తెలుగు సాహిత్య రంగానికి తీరని లోటు. ఒక తరం రచయితలతో మరో తరం రచయితలకు మధ్య వారధిలా నిలిచిన వ్యక్తి ఇక లేరు. సంప్రదాయం మరియు ఆధునికత మధ్య సంతులనం ఎలా ఉండాలో తన రచనల ద్వారా చూపించిన మార్గదర్శి మౌనమయ్యారు. అయితే ఆయన రచనలు జీవిస్తూనే ఉంటాయి. పుస్తకాలలో, పాఠకుల మనసుల్లో, సాహిత్య చర్చల్లో ఆయన ఆలోచనలు చిరస్థాయిగా నిలుస్తాయి.

సాహిత్యం కాలంతో పాటు మారుతూ ఉంటుంది. కానీ కొన్ని రచయితలు కాలాన్ని మించి నిలుస్తారు. ముక్తవరం పార్థసారథి అలాంటి వారిలో ఒకరు. ఆయన రచనల్లో కనిపించే మానవీయ విలువలు, భాషాపట్ల గల గౌరవం, సమాజంపై చూపిన బాధ్యతాభావం ఇవన్నీ నేటి తరానికి కూడా ప్రేరణగా నిలుస్తాయి. ఆయన లేని లోటు భౌతికమైనదే గాని, ఆలోచనాత్మకంగా ఆయన ఎప్పటికీ జీవిస్తారు.

తెలుగు సాహిత్య చరిత్రలో ముక్తవరం పార్థసారథి పేరు విశిష్టంగా నిలిచి పోతుంది. ఆయన మరణం ఒక యుగానికి ముగింపు అయితే, ఆయన రచనలు మరో యుగానికి పునాది రాళ్లుగా నిలుస్తాయి. పాఠకులు, రచయితలు, సాహిత్యాభిమానులు ఆయన స్మృతిని స్మరించుకుంటూ ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగడం ద్వారానే నిజమైన నివాళి అర్పించ గలరు. ఆయన జీవితం సాహిత్యానికి అంకితమైన నిరంతర సాధన; ఆయన మరణం సాహిత్య ప్రపంచానికి బాధాకరమైన శూన్యం.

అయినప్పటికీ ఆయన కలం చిహ్నించిన అక్షరాలు కాలగర్భంలో కలిసిపోకుండా తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయనే నమ్మకం ప్రతి తెలుగు హృదయంలో నిలిచి ఉంటుంది.



-రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

# ఇంగ్లీష్ ఒలంపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థులకు బంగారు పతకాలు




కరీంనగర్, మార్చి5 :(నేటి నిజం ప్రతినిధి) ఇంగ్లీష్ భాష వలన కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయని, సమాజంలో ప్రత్యేకమైన గుర్తింపును పొందగలుగుతామని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక కొత్తపల్లిలోన అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో విద్యార్థులకు అంతర్జాతీయ ఇంగ్లీష్ ఒలంపియాడ్ లో బం గారు పతకాలు సాధించిన సంద ర్భంగా ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు కమ్యూనికేషన్స్ తప్పనిసరని, కమ్యూనికేషన్ స్కిల్స్ ద్వారా అనేక విజయాలను సొంతం చేసుకోగలుగుతామని తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రతి విద్యార్థికి అనివార్యమని, వీటి ద్వారా వివిధ స్థాయిలలో గుర్తింపు పొందడమే కాకుండా పటిష్టమైనటువంటి అవకాశాలను సొంతం చేసుకొని ఉన్నతమైన జీవితాన్ని గడపగలుగుతారని అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ భాష అయిన ఇంగ్లీష్ భాష పట్ల పట్టు సాధించాలని, కఠోర సాధన ద్వారా ధారళంగా మాట్లాడగలుగుతారని అభిప్రాయ పడ్డారు. విద్యార్థులు ఇంగ్లీష్ బాషలో పట్టు సాధించాలని, వాటిలోని విషయాల పట్ల సమగ్ర అవగాహనను పెంపొందించుకొని ముందంజలో నిలవాలని సూచించారు. ఇటీవల కాలంలో ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ అయినా సిల్వర్ జోన్ ఫౌండేషన్ వారు నిర్వహించినటువంటి అంతర్జాతీయ ఇంగ్లీషు ఒలంపియాడ్ లో పాఠశాలకు చెందినటువంటి 4వ తరగతిఏ.శ్రియాన్ రెడ్డి రజత పతకం, వి వేదవిహార్ బంగారు పతకం, జి.విశాల్ కాంస్య పతకం, 6వ తరగతి, కే సుకృత బంగారు పతకం 7వ తరగతి, ఎం.లిఖిత్ రజత పతకం, బి.తన్మయి బంగారు పతకం, పి.సుశ్రిత్ - కాంస్య పతకం 8వ తరగతి,ఎం.విగ్నేష్ చంద్ర బంగారు పతకం, ఎల్.అక్షయ రజత పతకం, 9వ తరగతి, ఏ.యాష్ చంద్ర - కాంస్య పతకం, సి హెచ్ శ్రీహిత - రజత పతకం టి.అమిత విక్రమ్ - బం గారు పతకం సాధించారని, వివి ధ పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపి పుష్ప గుచ్చాలను అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 2026 ఆసియా క్రీడల సన్నాహాలను సమీక్షించిన కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ

న్యూఢిల్లీ, మార్చి 5:జపాన్‌లోని ఐచి-నగోయాలో సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరగనున్న 2026 ఆసియా క్రీడల సన్నాహాలపై కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎస్ఏఐ) ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో.. జరగబోయే క్రీడా సమరానికి భారత్ సిద్ధంగా ఉన్న తీరును మంత్రిత్వ శాఖ,ఎస్ఏఐ, ఇతర భాగస్వామ్య సంస్థలు కేంద్రమంత్రికి వివరించారు. ఈ ప్రతిష్టాత్మక పోటీల్లో భారత అథ్లెట్లు రాణించడానికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు.

2026 ఆసియా క్రీడల సన్నాహాల సమీక్ష కోసం 15 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ హరి రంజన్ రావు, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు పీటీ ఉష, ఆసియా క్రీడల ముఖ్య అధికారి డీ మిషన్ శ్రీ సహదేవ్ యాదవ్, డిప్యూటీ చీఫ్ డీ మిషన్ శరత్ కమల్ తదితరులు ఉన్నారు. శిక్షణ, రవాణా, క్రీడాకారుల సంక్షేమం, పోటీ సంసిద్ధతను క్రమబద్ధీకరించడానికి ఈ కమిటీ డిసెంబర్ 2025 నుంచి ఇప్పటికే నాలుగు సమావేశాలను నిర్వహించింది. ఈ కమిటీ క్రీడల్లో భారత్ నిర్వహించే ప్రచారానికి వ్యూహాత్మక ప్రణాళికను పర్యవేక్షిస్తోంది.

సమావేశంలో డాక్టర్ మన్సుఖ్ మాండవీయ మాట్లాడుతూ.. క్రీడాకారుల సంక్షేమం, ప్రతిభకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. "మా క్రీడాకారులే మా ప్రథమ ప్రాధాన్యత. శిక్షణ, స్పోర్ట్స్ సైన్స్ నుంచి రవాణా, కిట్, ఆహారం, వైద్య సంరక్షణ వరకు సాధ్యమయ్యే ప్రతి మద్దతును అందిస్తాం. దీనివల్ల వారు ఎటువంటి ఆటంకాలు లేకుండా సిద్ధం అయ్యి, ఆసియా క్రీడల్లో తమ అత్యుత్తమ ప్రదర్శనను కనబరచగలరు. ఏ పరిస్థితిలోనూ వారు ఇబ్బంది పడకుండా పోటీలో పతకాల సంఖ్యను పెంచడంపైనే వారు దృష్టి సారించేలా చూడటమే మా లక్ష్యం" అని ఆయన పేర్కొన్నారు.

2026 ఆసియా క్రీడల్లో భారత్ కొత్త మైలురాళ్లను సాధించడంలో క్రమబద్ధమైన సన్నాహాలు, బలమైన మద్దతు వ్యవస్థలు, సకాలంలో ప్రణాళికల రచన కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఇందుకు అన్ని పక్షాల మధ్య సమన్వయ కృషి అవసరమని అన్నారు.

సన్నాహాల్లో భాగంగా ప్రతి జాతీయ క్రీడా సమాఖ్య (ఎన్ఎస్ఎఫ్) ఆసియా క్రీడల టెక్నికల్ హ్యాండ్‌బుక్ కోసం ఒక నోడల్ అధికారిని నియమించింది. క్రీడల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచేందుకు ఆయా క్రీడా విభాగాల సాంకేతిక వివరాలపై క్రీడాకారులు, కోచ్‌లు, సహాయక సిబ్బందికి అవగాహన కల్పించడం వీరి బాధ్యత. క్రీడాకారులకు ఏకాగ్రతతో కూడిన శిక్షణ కోసం తగినంత సమయం ఇచ్చేలా జట్లను ముందే ఖరారు చేస్తారు. వైద్య బృందాలతో సహా సహాయక సిబ్బంది సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

విదేశాల్లో రవాణా సౌకర్యాల కోసం భారత రాయబార కార్యాలయాలతో నిరంతర సంప్రదింపులు జరుపుతున్నారు. శిక్షణ పర్యటనలు, పోటీల షెడ్యూల్‌ను ముందే ప్లాన్ చేసుకునే స్వేచ్ఛను క్రీడా సమాఖ్యలకు ఇచ్చారు. నిర్వహణ పరంగా సవాళ్లు ఉన్న క్రీడా విభాగాల కోసం వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక సహాయక సిబ్బందితో మద్దతు వ్యవస్థలను ఏర్పాటు చేస్తారు.

ఆహారం, వాతావరణ పరిస్థితులకు అలవాటు పడటం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఇందులో భాగంగా క్రీడలకు ముందే భారత్ లో అటువంటి పోటీ వాతావరణాన్ని సృష్టించేందుకు చర్యలను పరిశీలిస్తున్నారు.

2026 ఆసియా క్రీడల్లో మొత్తం 700 మందికి పైగా భారతీయ ఆటగాళ్లు 40కి పైగా క్రీడా విభాగాల్లో పోటీపడతారని అంచనా వేస్తున్నారు. వ్యూహాత్మక ప్రణాళిక, అంకితభావంతో కూడిన సన్నద్ధత, అన్ని భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయంతో 2022 హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో సాధించిన 106 పతకాల చారిత్రాత్మక రికార్డును అధిగమించడమే దేశ ప్రధాన లక్ష్యం.

నేటి ఉదయం జరిగిన సమావేశంలో.. ఐచి-నగోయా ఆసియా క్రీడల ప్రత్యేకతను వివరించారు. ఈ క్రీడలు ఫైవ్-క్లస్టర్ (ఐదు సమూహాల) పోటీ నమూనాను అనుసరిస్తాయని,క్రీడాకారులందరూ ఒకే ఒలింపిక్ గ్రామంలో ఉండకుండా, వేర్వేరు ప్రాంతాల్లో ఉంటూ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఐచి, గిఫు, షిజువోకా, విమానాశ్రయం-ఎక్స్‌పో జోన్ వంటి క్లస్టర్‌లలో వేదికలు విస్తరించి ఉన్నందున దీని కోసం ప్రయాణం, రవాణా, వైద్య సహాయం, క్రీడాకారుల రికవరీ కోసం వివరణాత్మక ప్రణాళిక అవసరమని పేర్కొన్నారు.

క్రీడల సమయంలో ఉండే బస పరిస్థితులకు ఆటగాళ్లు అలవాటు పడటానికి వీలుగా పాటియాలా, బెంగళూరులోని ఎస్ఏఐ ప్రాంతీయ కేంద్రాలలో ప్రత్యేక తాత్కాలిక కంటైనర్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. దీనివల్ల క్రీడల సమయంలో తాము ఉండబోయే కంటైనర్ తరహా నివాస ఏర్పాట్లపై ఆటగాళ్లకు ముందుగానే అవగాహన కలుగుతుంది. ఈ చర్య వల్ల క్రీడాకారులు ముందుగానే వాతావరణానికి అలవాటు పడతారని, పోటీ సమయంలో ఎటువంటి పరధ్యానం లేకుండా ఉంటారని అధికారులు తెలిపారు.

# లాడ్జ్‌లు, వసతి గృహాల నిర్వాహకులు నియమ, నిబంధనలు పాటించాలి

## -వేములవాడ పట్టణ సీఐ వీర ప్రసాద్




రాజన్న సిరిసిల్ల, మార్చి 5: నేటినిజం (ప్రతినిధి): వేములవాడ పట్టణ పరిధిలోని లాడ్జ్‌లు, వసతి గృహాల నిర్వాహకులతో వేములవాడ పట్టణ సీఐ వీర ప్రసాద్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భద్రతా పరమైన అంశాలు, చట్టపరమైన బాధ్యతల గురించి వారికి వివరించి తగు సూచనలు చేశారు.ప్రతి లాడ్జ్‌లో అతిథుల పూర్తి వివరాలు నమోదు చేసే విధంగా రిజిస్టర్/రికార్డులు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు.అతిథుల ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు పత్రాలను పరిశీలించి, ప్రతులు భద్రపరచాలనీ, మైనర్లకు (18 సంవత్సరాల లోపు వారికి) తల్లిదండ్రులు లేదా చట్టబద్ధ సంరక్షకులు లేకుండా గదులు ఇవ్వకూడదన్నారు. లాడ్జ ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, రికార్డింగ్స్‌ను నిర్దిష్ట కాలం వరకు భద్రపరచాలనీ, లాడ్జ గదుల్లో, ప్రాంగణంలో మద్యపానం పూర్తిగా నిషేధించాలన్నారు.నిబంధనలు, నిషేధాలు, పోలీసు సూచనలకు సంబంధించిన బోర్డులు స్పష్టంగా ప్రదర్శించాలన్నారు.నిబంధనలు ఉల్లంఘించినట్లయితే సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

# క్రీడా పాఠశాలల ప్రవేశాల పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్



రాజన్న సిరిసిల్ల, మార్చి 5: నేటినిజం (ప్రతినిధి): క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ గరిమ అగ్రవాల్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం ఆవిష్కరించారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ తెలంగాణా రాష్ట్రం లోని వివిధ క్రీడల పాఠశాలలు: హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ రీజనల్ స్పోర్ట్స్ స్కూల్ లో 2026-27 విద్యా సంవత్సరంలో 4.వ తరగతిలో ఆసక్తి గల బాలబాలికలు ప్రవేశము లేదా అడ్మిషన్ పొందే వివరాలతో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్, తదితరులు పాల్గొన్నారు.




Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com